
ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
సోమవారం 03 ఆగస్టు 2026 | సంపుటి - 01 సంచిక - 355 | పేజీలు - 8 వెల - 5

## ముందు జీతాలు, పెన్షన్లు తర్వాతే పనులకు నిధులు



ప్రాజెక్టులపై తమిళనాడు సర్కార్ కఠిన నిబంధనలు
రూ.10 కోట్లకు పైబడిన పనులకు అనుమతి తప్పనిసరి
పెద్ద ప్రాజెక్టులను ప్యాకేజీలుగా విభజించడంపై నిషేధం
చెన్నై కార్పొరేషన్ ఆర్థిక సంక్షోభంతో కొత్త మార్గదర్శకాలు

3లో..

### కడుపులోనే కూతురికి
# మరణశిక్ష



అక్రమ అబార్షన్ల ముఠాలపై ఉక్కుపాదం ఎప్పుడూ..?
లింగ నిర్ధారణ నుంచి గర్భస్రావం వరకు కోట్ల రూపాయల దందా
పట్టణాల నుంచి గ్రామాల దాకా విస్తరిస్తున్న అక్రమ నెట్‌వర్క్
జనగామ ఘటన మరోసారి బయటపెట్టిన భయానక వాస్తవం
చట్టాలున్నా అమలులో నిర్లక్ష్యం.. ప్రాణాలు కోల్పోతున్న మహిళలు

కాకతీయ, తెలంగాణ బ్యూరో/ వరంగల్ బ్యూరో : గర్భంలో పెరుగుతున్న శిశువుకు జన్మనివ్వాలా... వద్దా... అనే నిర్ణయం తల్లి దండ్రుల చేతుల్లో ఉండొచ్చు. కానీ ఆ నిర్ణయం చట్టబద్ధంగా, వైద్య ప్రమాణాలకు లోబడి ఉండాల్సిందే. అయితే రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. గర్భంలోని శిశువు ఆడపిల్ల అని తెలిసిన క్షణం నుంచి అక్రమ నెట్‌వర్క్‌లు రంగంలోకి దిగుతున్నాయి. లింగ నిర్ధారణ... మధ్యవర్తులు... ఆర్ఎంపీలు... ప్రైవేట్ క్లినిక్‌లు... నకిలీ వైద్యులు... చివరకు రహస్య ప్రదేశాల్లో గర్భస్రావాలు... ఇదే ఇప్పుడు నిశ్శబ్దంగా సాగుతున్న భూగర్భ దందా. ఈ దందాలో అమాయక మహిళల ప్రాణాలే బల వుతున్నాయి. ఇటీవల జనగామలో వెలుగు చూసిన గర్భిణి మృతి ఘటన... ఇలాంటి అక్రమ వ్యవస్థ ఎంత లోతుగా పాతుకుపో యిందో మరోసారి బయటపెట్టింది. అది ఒక్క సంఘటన మాత్రమే... కానీ దాని వెనుక దాగి ఉన్న వ్యవస్థపై ఇప్పుడు ప్రశ్నలు మొదల య్యాయి.

**లింగ నిర్ధారణే తొలి మెట్టు..!**

చట్టం ప్రకారం గర్భస్థ శిశువు లింగాన్ని నిర్ధా రించడం, వెల్లడించడం పూర్తిగా నిషేధం. అయినప్పటికీ కొందరు మధ్యవర్తులు, నకిలీ వైద్యులు, అక్రమ స్కానింగ్ కేంద్రాల సహకా రంతో ఈ ప్రక్రియ కొనసాగుతోందనే ఆరోప ణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. అధికారికంగా స్కానింగ్ కేంద్రాలు లింగాన్ని వెల్లడించకపో యినా... సంకేతాలు, కోడ్ పదాలు లేదా మధ్య వర్తుల ద్వారా సమాచారం చేరవేస్తున్నారనే అనుమానాలు వైద్యరంగంలోనే వినిపిస్తు న్నాయి. ఆ సమాచారం ఆధారంగా గర్భస్రా వాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అధికా రులు గతంలో పలు కేసుల్లో గుర్తించారు. అక్రమ గర్భస్రావాల వ్యవస్థలో ఒక వ్యక్తి మాత్రమే ఉండడు. గర్భిణిని తీసుకువచ్చే మధ్యవర్తి, లింగ నిర్ధారణకు దారి చూపే వ్యక్తి, గర్భస్రావం నిర్వహించే వ్యక్తి,

........తరువాయి 4లో

## నవోదయ ప్రవేశాలకు మరో అవకాశం

దరఖాస్తు గడువు ఆగస్టు 7 వరకు పొడిగింపు
6వ తరగతి ప్రవేశాలకు ఉచితంగా దరఖాస్తుల స్వీకరణ
అర్హులైన విద్యార్థులు అవకాశం వినియోగించుకో వాలని సూచన



కాంగ్రెస్ మోసాలకే వేణు
## ఆత్మహత్యాయత్నం

ఉద్యోగాల పేరుతో రేవంత్ సర్కారు యువతను మోసం చేసింది
గ్రూప్స్ అభ్యర్థి వేణు ఘటన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్
బాధితుడిని పరామర్శించిన పువ్వాడ అజయ్, నామా నాగేశ్వరరావు
నిరుద్యోగులు అధైర్యపడొద్దని బీఆర్ఎస్ పిలుపు
వేణు కుటుంబానికి ఇల్లు.. ఉచిత వైద్యం కల్పించాలని డిమాండ్

6లో..



## కాళేశ్వరం తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక

కాంగ్రెస్ మంత్రుల వ్యాఖ్యలు అజ్ఞానానికి నిదర్శనం
మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్

6లో

వారం రోజుల్లోనే
## జడ్జి బదిలీ

నీట్ పేపర్ లీక్ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో కీలక మార్పు
స్పెషల్ జడ్జి అను గ్రోవర్ బలిగాకు
హైకోర్టు బదిలీ ఉత్తర్వులు
ఎన్ఐఏ ప్రత్యేక కోర్టుకు బాధ్యతలు
కొత్త జడ్జిగా అజయ్ గుప్తా నియామకం
నీట్ కేసు విచారణ కొనసాగుతుండగానే మార్పు
సోమవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ




నీట్ కేసు విచారణకు ప్రత్యేకంగా నియమించిన జడ్జీ అను గ్రోవర్ బలిగాను బాధ్యతల నుంచి మార్చుతూ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు

కాకతీయ, నేషనల్ డెస్క్ : దేశవ్యాప్తంగా సంచలనం రేపిన పేపర్ లీక్ కేసుల విచారణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఇటీవలే ఆ కోర్టుకు స్పెషల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన అను గ్రోవర్ బలిగాను ఢిల్లీ హైకోర్టు కేవలం వారం రోజుల వ్యవధిలోనే మరో కీలక బాధ్యతలకు బదిలీ చేసింది. శనివారం విడుదల చేసిన బదిలీ ఉత్తర్వుల్లో ఆమెతో పాటు మరో 137 మంది న్యాయమూర్తులకు పోస్టింగ్‌లు మార్చారు. దీంతో పేపర్ లీక్ కేసుల విచారణ మధ్యలోనే జడ్జి మార్పు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. జులై 25న ఫాస్ట్‌ట్రాక్ కోర్టు స్పెషల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన అను గ్రోవర్ బలిగా, కేవలం వారం రోజులే ఆ బాధ్యతల్లో కొనసాగారు. అనంతరం ఆమెను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టం కింద ఉగ్రవాద కేసులను విచారించే ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో స్పెషల్ జడ్జి అజయ్ గుప్తాను నియమిస్తూ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే ఉత్తర్వుల్లో వికాస్ ధుల్, ప్రశాంత్ శర్మ, పుల్స్య ప్రమచల, కిరణ్ బన్సల్, అమిత్ బన్సల్‌లను కూడా ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులకు నియమించింది.

**నీట్ కేసు మధ్యలోనే మార్పు**

దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపిన నీట్ పేపర్ లీక్ కేసులో తొలి విచారణ జులై 27న జరిగింది. ........తరువాయి 4లో

మల్లన్నకు
# రాజకీయ పరీక్ష

మళ్లీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగేందుకు యోచన
పార్టీ ఉంది... క్యాడర్ ఎంత బలంగా ఉంది..?
త్వరలోనే పాదయాత్ర చేపట్టేందుకు సన్నాహకాలు
అందులో భాగంగానే పార్టీ నిర్మాణంపై ఫోకస్
ప్రజా మద్దతు పెంచుకునేందుకు కసరత్తు
టీఆర్పీ విద్యావంతుల మనసు చూరగొంటుందా?
మూడు జిల్లాల్లో ప్రధాన పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలుస్తుందా..?




కాకతీయ, తెలంగాణ బ్యూరో : వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు ఇంకా సమయం ఉన్నప్పటికీ రాజకీయ సమీకరణాలు ఇప్పటి నుంచే మారుతున్నాయి. ఎమ్మెల్సీ చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న) కాంగ్రెస్‌కు దూరమైన తర్వాత ఏర్పాటు చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)తో మళ్లీ అదే స్థానాన్ని లక్ష్యంగా పెట్టుకోవడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. వచ్చే ఏడాది మార్చితో ఎమ్మెల్సీ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మూడు ఉమ్మడి జిల్లాల్లో పాదయాత్ర చేపట్టేందుకు ఆయన సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఎన్నిక మల్లన్న వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తుతో పాటు... తెలంగాణ రాజ్యాధికార పార్టీ క్షేత్రస్థాయి బలాన్ని పరీక్షించే తొలి ప్రధాన రాజకీయ సమరంగా మారనుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తీన్మార్ మల్లన్న రాజకీయ ప్రస్థానం సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా సాగింది. డిజిటల్ మీడియా వేదికగా ప్రభుత్వాలపై విమర్శలు, ఉద్యోగాలు, నిరుద్యోగం, ........తరువాయి 2లో

తెలుగు రాష్ట్రాలకు
## గ్రీన్ కారిడార్

ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రాకపోకలకు గ్రీన్ సిగ్నల్
రూ.3,573 కోట్లతో 165 కి.మీ.
ఆధునిక ఎక్స్‌ప్రెస్‌వే సిద్ధం
హైదరాబాద్–ఉత్తరాంధ్ర ప్రయాణ సమయం సగానికి తగ్గింపు
2017 నుంచి కృషి ఫలించింది..
హైవేపై ప్రయాణించిన మంత్రి తుమ్మల
రైతులు, పరిశ్రమలు, రవాణా రంగానికి కొత్త ఊపు

6లో



చిట్టీల పేరుతో
## రూ.5 కోట్ల మోసం

కుటుంబంతో వ్యాపారి పరార్
రాజేంద్రనగర్ బుద్వేల్‌లో కలకలం
ఇంటికి తాళం వేసి అదృశ్యమైన నిర్వాహకుడు
డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ బాధితుల ఆందోళన

4లో



## బోనం..తెలంగాణ జీవనగీతం

ఆషాఢం అడుగుపెడితే తెలంగాణలో భక్తిభావం ఉప్పొంగుతుంది. ఎండలతో అలసిపోయిన భూమి తొలి వర్షపు చినుకులతో పరవశించినట్లు.. ప్రజల మనసులు కూడా అమ్మవారి నామస్మరణతో పులకించిపోతాయి. గల్లీ నుంచి గోల్కొండ వరకు, పల్లె నుంచి భాగ్యనగరం వరకు పసుపు పరిమళాలు వెదజల్లుతాయి. డప్పుల మోతలు మారు మోగుతాయి. పోతురాజుల వీరనృత్యాలు ఊరంతా ఉత్సాహాన్ని నింపుతాయి. శివసత్తుల పూనకాలతో ఆలయాలు ఆధ్యాత్మిక శక్తిని ప్రసరిస్తాయి.ఇవన్నీ కలిసి తెలంగాణ తన అసలు సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తుంది.



ఈ నేల సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం
భక్తి, సంప్రదాయం, తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక
గోల్కొండలో తొలి బోనంతో ఆషాఢ మహోత్సవాలకు అంకురార్పణ
వెయ్యేళ్ల చరిత్రను మోస్తున్న తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి
పోతరాజుల వీరనృత్యాలు...
త్తుల పూనకాలతో భక్తి ప్రవాహం
గ్రామదేవతల ఆరాధనలో ప్రతిఫలించే ప్రకృతి–ప్రజల అనుబంధం

3లో..



జంతర్ మంతర్లో
# అల్లర్లే టార్గెట్!



కాకతీయ, నేషనల్ డెస్క్ : దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన విద్యార్థుల నిరసనల్లోకి చొరబడి అల్లర్లు సృష్టించేందుకు పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్ కుట్ర పన్నిందనే అంశం వెలుగులోకి వచ్చింది. రెండు రోజుల క్రితం పశ్చిమ బెంగాల్‌లో అరెస్టైన అనుమానిత ఉగ్రవాది హమీమ్ మోండల్ విచారణలో ఈ వివరాలు వెల్లడైనట్లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) అధికారులు తెలిపారు. జైషే మహ్మద్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు పనిచేస్తున్న అతడు, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఆందోళనల్లోకి పోలీసు యూనిఫాం లో చొరబడి విధ్వంసం సృష్టించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు విచారణలో తేలిందని ........తరువాయి 2లో



బంగాల్‌లో పట్టుబడ్డ అనుమానిత ఉగ్రవాది
విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి
నిరసనల్లోకి చొరబడి విధ్వంసానికి పాక్ హ్యాండ్లర్ల ఆదేశాలంటున్న ఎస్టీఎఫ్
రాజకీయ ప్రముఖులపై హనీట్రాప్ నెట్‌వర్క్..
ఝార్ఖండ్ యువతి అరెస్ట్
దేశవ్యాప్త ఉగ్ర మాడ్యూల్‌పై దర్యాప్తు ముమ్మరం





# శాంతిస్తున్న గోదారమ్మ

- ఊపిరి పీల్చుకున్న లోతట్టు ప్రాంతాలు
- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కూడా ఉపసంహరణ
- ముంపు గ్రామాల్లో కొనసాగుతున్న సహాయక చర్యలు
- 250 మందిని పునరావాస కేంద్రాలకు తరలించిన అధికారులు
- వందల ఎకరాల్లో నీటమునిగిన పంటలు... రాకపోకలు ఇంకా స్తంభనం

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి : తెలంగాణతో పాటు మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో ఉగ్రరూపం దాల్చిన గోదావరి క్రమంగా శాంతిస్తోంది. ఈ ఏడాది తొలిసారి భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి 56 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం... ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో క్రమంగా తగ్గుముఖం పట్టింది. శనివారం రాత్రికే మూడో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించగా, ఆదివారం ఉదయం 8 గంటలకు నీటిమట్టం 47.8 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరికను కూడా అధికారులు ఉపసంహరించారు. దీంతో లోతట్టు ప్రాంత ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి వరద ప్రభావం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాలపై తీవ్రంగా పడింది. బూర్గంపాడు మండలంలోని సారపాక–నాగినేని ప్రోలు–రెడ్డిపాలెం గ్రామాల మధ్య రోడ్డుపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బూర్గంపాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కుక్కునూరు వెళ్లే ప్రధాన మార్గం మూతపడింది. బూర్గంపాడు కొల్లు సమీపంలో నాలుగు లారీలు వరద నీటిలో చిక్కుకుపోగా అధికారులు వెంటనే స్పందించి డ్రైవర్లు, క్లీనర్లను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.

## 250 మంది సురక్షిత ప్రాంతాలకు

ముంపు ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల నుంచి సుమారు 250 మంది ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. అశ్వాపురం మండలంలోని బట్టీలగుంపు, అమ్మగారిపల్లి, అమెర్ద, చింతిర్యాల, ఆనందాపురం, నెల్లిపాక పంచాయతీలు వరద నీటితో చుట్టుముట్టాయి. అలాగే మొండికుంట–భద్రాచలం మార్గంతో పాటు మణుగూరు మండలం అన్నారం–కమలాపురం గ్రామాల మధ్య కూడా రాకపోకలు నిలిచిపోయాయి. వరదల కారణంగా వందల ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగి రైతులు ఆందోళన చెందుతున్నారు. భద్రాచలం పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. స్నాన ఘాట్‌లు, కల్యాణకట్ట ప్రాంతం వరద నీటిలో మునిగిపోగా... గోదావరి ఒడ్డున ఉన్న పునర్వసు మండపం, గోదారమ్మ విగ్రహం, వల్లీదేవసేన ఆలయం, శ్రీ ఆంజనేయస్వామి ఆలయం పరిసరాల్లో ప్రవాహ తీవ్రత పెరిగింది. బ్యాక్‌వాటర్ ప్రభావంతో కాలనీల్లోకి నీరు చేరకుండా భద్రాచలం నుంచి గోదావరిలో కలిసే మురుగు నీటి లాకులను మూసివేసి, భారీ సామర్థ్యం గల 'బాహుబలి' మోటార్లతో నీటిని ఎప్పటికప్పుడు ఎత్తిపోశారు. దీంతో లోతట్టు కాలనీలు ముంపు నుంచి బయటపడ్డాయని స్థానికులు తెలిపారు.

## 43 అడుగులకు తగ్గితే ఇళ్లకు...

ప్రస్తుతం పునరావాస కేంద్రాల్లో ఉన్న వరద బాధితులు గోదావరి నీటిమట్టం 43 అడుగుల కంటే దిగువకు చేరిన తర్వాత తిరిగి తమ ఇళ్లకు వెళ్లే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరి ప్రవాహం మరింత తగ్గే అవకాశముందని అంచనా వేస్తున్నారు. అయితే నదీ పరివాహక ప్రాంత ప్రజలు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# కేసీఆర్ హయాంలోనే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా

- సమైక్య పాలకులు బోనాలను విస్మరించారు
- బోనాలు తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక
- ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్

కాకతీయ, హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవానికి బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, రాష్ట్రం ఏర్పడిన తర్వాతే ఈ పండుగకు తగిన గౌరవం దక్కిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సాధనలో అమ్మవారి ఆశీస్సులు కీలకమని కేసీఆర్ ఎప్పుడూ చెప్పేవారని గుర్తుచేశారు. ఉజ్జయిని మహంకాళి ఆలయానికి చేరుకున్న కేటీఆర్‌కు అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆయనకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శాలువా కప్పి సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

## కేసీఆర్‌తోనే రాష్ట్ర పండుగ హోదా

బోనాలు కులాలు, మతాలకు అతీతంగా తెలంగాణ ప్రజలను ఏకం చేసే మహోత్సవమని కేటీఆర్ అన్నారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగకు ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను అధికారిక రాష్ట్ర పండుగగా ప్రకటించి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించామని కేటీఆర్ తెలిపారు. ఆలయాల అభివృద్ధికి, పండుగల నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు.

## రాష్ట్ర సుభిక్షం కోసం ప్రార్థనలు

ఈ సందర్భంగా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కేటీఆర్ తెలిపారు. బోనాలు కేవలం ఆధ్యాత్మిక వేడుక మాత్రమే కాకుండా తెలంగాణ సంస్కృతి, సామాజిక ఐక్యతను ప్రతిబింబించే పండుగగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

# 'రాజకీయం వేరు... రాష్ట్ర ప్రయోజనం వేరు'

- మోదీ వేదికపై డీకే శివకుమార్ వ్యాఖ్యలు
- రాజకీయ వర్గాల్లో చర్చ
- 'మా ప్రధాని' అంటూ సహకార సమాఖ్య స్ఫూర్తికి పెద్దపీట
- రాష్ట్రాభివృద్ధికి కేంద్రంతో సమన్వయమే మార్గమనే సంకేతం
- దక్షిణాది కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ శైలిపై ఆసక్తికర చర్చ



కాకతీయ, జాతీయ బ్యూరో : ఎన్నికల రాజకీయాలు ఒకటి... పరిపాలన మరొటి. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రయోజనాలే ప్రథమం. కేంద్రంతో ఘర్షణ కంటే సమన్వయమే అభివృద్ధికి బాట. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ శనివారం ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో చేసిన వ్యాఖ్యలు ఈ అంశాలపైనే రాజకీయ చర్చకు దారితీశాయి. మైసూరులోని రామకృష్ణ విద్యాలయ ప్రాంగణంలో వివేకానంద స్మారక యూత్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీతో వేదిక పంచుకున్న డీకే శివకుమార్, "మా ప్రధాని మోదీ" అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు కారణమయ్యాయి. ప్రధానిని ఉద్దేశించి మాట్లాడిన ఆయన, "కర్ణాటక అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రానికి విశాల హృదయంతో సహాయం అందించాలి" అని కోరారు. తన ప్రసంగ సమయాన్ని కూడా ప్రధాని సందేశానికి వదులుతూ, దేశ ప్రజలకు ప్రధాని ప్రసంగమే ముఖ్యమని చెప్పడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఘర్షణ కాదు... సమన్వయమే..!

రాజకీయ ప్రత్యర్థులుగా పోటీ పడటం ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, పరిపాలనలో రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయాల్సిందేననే సందేశాన్ని డీకే శివకుమార్ ఇచ్చారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేంద్రంతో నిరంతర ఘర్షణ వల్ల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడే అవకాశాన్ని గుర్తించి, సహకార ధోరణిని ప్రదర్శించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుందని విశ్లేషిస్తున్నారు. దక్షిణాది కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రంతో వ్యవహరిస్తున్న తీరుపై కూడా ఈ పరిణామం కొత్త చర్చకు దారితీసింది. ఎన్నికల సమయంలో విమర్శలు చేసినప్పటికీ, అధికార బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రంతో సమన్వయం కొనసాగించడం అవసరమనే భావన బలపడుతున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, కేంద్ర నిధులు వంటి అంశాలపై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను పలుమార్లు కలిసి రాష్ట్ర అవసరాలను వివరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కర్ణాటకలో డీకే శివకుమార్ వ్యాఖ్యలు కూడా అదే తరహా రాజకీయ దృక్పథానికి ప్రతిబింబంగా కనిపిస్తున్నాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

## సహకార సమాఖ్యకు ప్రాధాన్యం

రాష్ట్రాల అభివృద్ధి కోసం కేంద్రం–రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని డీకే శివకుమార్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. రాజకీయ భేదాభిప్రాయాలను పక్కనబెట్టి ప్రజల అభ్యున్నతినే లక్ష్యంగా పెట్టుకోవాలని ఆయన చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం ఈ పరిణామాన్ని కేవలం ఒక సభా ప్రసంగంగా కాకుండా, రాజకీయాలకు ఒక గీత... పరిపాలనకు మరో గీత అనే కొత్త రాజకీయ ధోరణికి సంకేతంగా పలువురు విశ్లేషిస్తున్నారు. కేంద్రంతో సమన్వయం కొనసాగిస్తూ రాష్ట్ర హక్కులు సాధించుకోవాలనే వ్యూహం భవిష్యత్ రాజకీయాల్లో మరింత ప్రాధాన్యం సంతరించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ఎల్‌నినో ఎఫెక్ట్‌కు బ్రేక్..!

- వాయుగుండం దెబ్బతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వానల జోరు
- మరో రెండు రోజుల పాటు వర్షాలు... వాతావరణ శాఖ హెచ్చరిక
- గోదావరి ఉప్పొంగింది... ప్రాజెక్టులకు జలకళ
- తెలంగాణలో లోటు వర్షపాతం కేవలం 5 శాతానికే పరిమితం

కాకతీయ, తెలంగాణ బ్యూరో : ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశాలున్నాయన్న అంచనాలను వాయుగుండం ప్రభావం తారుమారు చేసింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న విస్తార వర్షాలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షపాతం గణనీయంగా పెరిగింది. గోదావరి ఉప్పొంగగా, కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులకు భారీగా వరద జలాలు చేరుతున్నాయి. వాయుగుండం ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని తొలుత అంచనా వేశారు. అయితే ఇటీవల ఏర్పడిన వాయుగుండం కారణంగా విస్తారంగా వర్షాలు కురవడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

## ఆంధ్రప్రదేశ్‌లో మరో రెండు రోజులు వానలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో మాత్రమే భారీ వర్షాలు నమోదవుతున్నప్పటికీ, మరో రెండు రోజుల పాటు కోస్తాంధ్ర, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని హెచ్చరించింది. గోదావరి నదికి భారీగా వరద జలాలు చేరడంతో పోలవరం, ధవళేశ్వరం బ్యారేజీల వద్ద లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది.

## తెలంగాణలో తగ్గిన లోటు వర్షపాతం

తెలంగాణలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన జలాశయాలు, ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. రాష్ట్రంలో లోటు వర్షపాతం గణనీయంగా తగ్గి ప్రస్తుతం కేవలం 5 శాతానికే పరిమితమైందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. భూగర్భ జలమట్టాలు పెరగడంతో తాగునీటి సమస్య చాలా వరకు తగ్గిందని, సాగునీటిపరిస్థితులుకూడామెరుగుపడ్డాయనిఅధికారులు తెలిపారు.

# పీఎఫ్ సొమ్ము మాయమైందా..?

- ఈపీఎఫ్ఓ నిధుల పెట్టుబడులపై సీబీఐ కేసు
- అనిల్ అంబానీతో పాటు అప్పటి అధికారులు, ట్రస్టీలపై ఎఫ్ఐఆర్
- రూ.2,500 కోట్ల పెట్టుబడి... రూ.1,816 కోట్ల నష్టం ఆరోపణ
- నిబంధనలు ఉల్లంఘించి పెట్టుబడులా..? సీబీఐ దర్యాప్తు ముమ్మరం

కాకతీయ, నేషనల్ డెస్క్ : ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) సొమ్ము పెట్టుబడుల వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఉద్యోగుల కష్టార్జిత పొదుపులను విచక్షణారహితంగా ప్రైవేట్ కంపెనీ బాండ్లలో పెట్టుబడి పెట్టి, వేల కోట్ల రూపాయల నష్టానికి కారణమయ్యారన్న ఆరోపణలతో ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్‌కు చెందిన అప్పటి అధికారులు, ఈపీఎఫ్ ట్రస్టీలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో భారీ కుట్ర, అధికార దుర్వినియోగం, నేరపూరిత విశ్వాసఘాతుకం జరిగి ఉండొచ్చనే అనుమానాలతో సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. సీబీఐ ప్రాథమిక అభియోగాల ప్రకారం... 2017 నుంచి 2019 మధ్యకాలంలో ఈపీఎఫ్ఓ ట్రస్ట్ నిధుల నుంచి సుమారు రూ.2,500 కోట్లను రిలయన్స్ క్యాపిటల్ జారీ చేసిన నాన్–కన్వర్టిబుల్ డిబెంచర్లు (ఎన్‌సీడీలు), బాండ్లలో పెట్టుబడిగా పెట్టారు. అనంతరం రిలయన్స్ క్యాపిటల్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని, బాండ్లపై అసలు, వడ్డీ చెల్లింపుల్లో డిఫాల్ట్ కావడంతో ఈపీఎఫ్ఓకు సుమారు రూ.1,816 కోట్ల మేర కోలుకోలేని నష్టం వాటిల్లిందని దర్యాప్తు సంస్థ పేర్కొంది.

## రేటింగ్ తగ్గినా ఎందుకు పెట్టుబడులు..?

దర్యాప్తులో కీలకంగా నిలిచిన అంశం... పెట్టుబడుల సమయంలోనే సంబంధిత రేటింగ్ సంస్థలు రిలయన్స్ క్యాపిటల్ క్రెడిట్ రేటింగ్‌ను తగ్గించాయా? తగ్గించినట్లయితే ఆ హెచ్చరికలను పట్టించుకోకుండా ఎందుకు ఈపీఎఫ్ నిధులను అదే సంస్థలో పెట్టుబడి పెట్టారు? అనే కోణం. ప్రభుత్వ పెట్టుబడి మార్గదర్శకాలను ఉల్లంఘించారా? కొందరు అధికారులు ప్రైవేట్ సంస్థకు అనుకూలంగా వ్యవహరించారా? నిర్ణయ ప్రక్రియలో ఎవరెవరు పాత్ర పోషించారు? అనే అంశాలపై సీబీఐ లోతుగా ఆరా తీస్తోంది. అనిల్ అంబానీతో పాటు అప్పటి రిలయన్స్ క్యాపిటల్ అధికారుల పాత్రను పరిశీలిస్తున్న సీబీఐ... నాటి ఈపీఎఫ్ఓ ట్రస్టీలు, సంబంధిత ఉన్నతాధికారులు, నియంత్రణ సంస్థల అధికారుల నిర్ణయాలను కూడా పరిశీలిస్తోంది.

## అనిల్ అంబానీ వివరణ

అయితే ఈ ఆరోపణలను అనిల్ అంబానీ వర్గాలు ఖండిస్తున్నాయి. 2022 మార్చిలోనే రిలయన్స్ క్యాపిటల్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారని, అనంతరం దివాలా ప్రక్రియలో భాగంగా కంపెనీని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదంతో హిందూజా గ్రూప్‌కు బదిలీ చేశారని పేర్కొంటున్నాయి. ప్రస్తుత వ్యవహారాలకు పాత యాజమాన్యాన్ని నేరుగా బాధ్యులను చేయలేమని కంపెనీ ప్రతినిధులు వాదిస్తున్నారు. ఉద్యోగుల భవిష్యనిధి వంటి సామాజిక భద్రతా నిధుల పెట్టుబడుల విషయంలో నిర్ణయాలు ఎలా తీసుకున్నారు? నిబంధనలు పాటించారా? లేక నిర్లక్ష్యం, అక్రమాలకు చోటు కల్పించారా? అనే అంశాలకు సీబీఐ దర్యాప్తులో సమాధానాలు లభించే అవకాశం ఉంది.

# జంతర్‌మంతర్లో అల్లర్లే టార్గెట్!

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. తూర్పు బర్ధమాన్ జిల్లాలో అరెస్టైన హమీమ్ మొండల్‌ను విచారిస్తున్న సందర్భంగా మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ఎస్‌టీఎఫ్ ఐజీ గౌరవ్ శర్మ తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర హ్యాండ్లర్లు అతడికి రాజకీయ ప్రముఖుల కదలికలపై సమాచారం సేకరించే బాధ్యత అప్పగించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి సువేందు అధికారి భద్రతా ఏర్పాట్లు, ప్రయాణాలు, భద్రతలో ఉండే బలహీనతలపై నిఘా ఉంచాలని ఆదేశాలు అందినట్లు తెలిపారు. ఈ కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.

## హనీట్రాప్‌తో సమాచార సేకరణ..

హమీమ్‌కు సహకరించిన ఝార్ఖండ్‌కు చెందిన అర్పితా సర్కార్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులను హనీట్రాప్ ద్వారా పరిచయం చేసుకుని, వారి నుంచి సున్నితమైన సమాచారాన్ని సేకరించి హమీమ్‌కు చేరవేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. చిన్నస్థాయి రాజకీయ నాయకుల ద్వారా పెద్ద నాయకులకు చేరుకునే ప్రయత్నాలు కూడా ఈ నెట్‌వర్క్‌లో భాగంగా సాగినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. విచారణలో మరో సంచలన విషయం బయటపడినట్లు అధికారులు పేర్కొన్నారు. బంగాల్‌కు చెందిన ఓ మంత్రి కుమారుడిని హనీట్రాప్ ద్వారా అపహరించి భారీగా డబ్బు వసూలు చేయాలనే కుట్ర కూడా వీరిద్దరూ పన్నినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా ఆధారాలు సేకరిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు.

## పాక్ హ్యాండ్లర్లతో ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్

పాకిస్థాన్‌కు చెందిన షెహజాద్ భట్టి గ్యాంగ్‌తో హమీమ్‌కు సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రానా, ఉజైర్, అబిద్ జట్ తదితర పేర్లతో గుర్తించిన హ్యాండ్లర్ల నుంచి ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా ఆదేశాలు అందినట్లు విచారణలో తేలిందని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా ఏర్పడిన పరిచయాలు క్రమంగా ఉగ్రవాద నెట్‌వర్క్‌గా మారినట్లు అనుమానిస్తున్న అధికారులు, ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుతో పాటు గతంలో గుజరాత్‌లో జైషే మహ్మద్‌కు చెందిన మాడ్యూల్‌ను ఛేదించిన ఘటనలను కూడా దర్యాప్తు సంస్థలు పరిశీలిస్తున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఒకే తరహా నెట్‌వర్క్ పనిచేస్తోందా? రాజకీయ ప్రముఖులు, విద్యార్థి ఉద్యమాలు, ప్రజా నిరసనలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసక చర్యలకు ప్రణాళికలు రచించారా? అనే కోణాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. అరెస్టైన నిందితుల నుంచి లభిస్తున్న డిజిటల్ ఆధారాలు, చాట్‌లు, కమ్యూనికేషన్ రికార్డుల ఆధారంగా ఉగ్ర నెట్‌వర్క్‌ను పూర్తిగా వెలికితీసేందుకు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు.

# విపత్తు వేళ ప్రాణాలకు కవచం

- ఇప్పుడు జీతానికీ భరోసా..!
- డీఎస్‌డీఎంఏ సిబ్బందికి 100 శాతం వేతన పెంపు
- 16 ఏళ్ల తర్వాత జీతాల సవరణకు ఢిల్లీ ప్రభుత్వ నిర్ణయం
- ప్రాజెక్ట్ ఆఫీసర్లు, డీపీవోలు, కోఆర్డినేటర్లకు భారీ ఊరట
- 'విపత్తు నిర్వహణ సిబ్బందికి ఇది దక్కాల్సిన న్యాయం' : సీఎం రేఖా గుప్తా



కాకతీయ, నేషనల్ డెస్క్ : ఢిల్లీలో ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (డీఎస్‌డీఎంఏ)లో పనిచేస్తున్న సిబ్బందికి నెలవారీ వేతనాలను ఏకంగా 100 శాతం పెంచాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంతో 2009 నుంచి విపత్తు నిర్వహణ సేవల్లో పనిచేస్తున్న ప్రాజెక్ట్ ఆఫీసర్లు (పీవోలు), డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు (డీపీవోలు), ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు (పీసీలు) భారీగా లబ్ధి పొందనున్నారు. సిబ్బంది వేతనాల పెంపుపై ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్పందిస్తూ, ఇది చాలా కాలంగా వారికి దక్కాల్సిన న్యాయమని పేర్కొన్నారు. విపత్తుల సమయంలో ప్రాణాలను కాపాడేందుకు, అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ అధికారులు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు.

## 16 ఏళ్ల నిరీక్షణకు ముగింపు

యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ) భాగస్వామ్యంతో 2009లో డీఎస్‌డీఎంఏలో ఈ పోస్టులు సృష్టించారు. అయితే అప్పటి నుంచి గడిచిన 16 ఏళ్లలో ఒక్కసారి కూడా వారి వేతనాలు సవరించలేదు. ఈ సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలుకుతూ ప్రభుత్వం ఇప్పుడు వేతనాల పెంపునకు ఆమోదం తెలిపింది. గత పదిహేనేళ్లలో జీవన వ్యయం, ద్రవ్యోల్బణం, నగర అవసరాలు గణనీయంగా పెరిగినా... డీఎస్‌డీఎంఏ సిబ్బంది గౌరవ వేతనాలు మాత్రం యథాతథంగానే కొనసాగాయి. ప్రాజెక్ట్ ఆఫీసర్లు, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లకు నెలకు రూ.25 వేల, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లకు రూ.20 వేల మాత్రమే అందుతున్నాయి. ఈ పోస్టులు సాధారణ ప్రభుత్వ పే–స్ట్రక్చర్‌లో లేకపోవడంతో కరువు భత్యం (డీఏ), కాలానుగుణ వేతన సవరణల ప్రయోజనాలు కూడా వీరికి లభించలేదు. ఈ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన ప్రభుత్వం..వారి సేవలకు తగిన గుర్తింపుగా వేతనాలను రెట్టింపు చేయాలని నిర్ణయించింది.

## విపత్తు వేళ కీలక బాధ్యతలు

'డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్–2005' ప్రకారం ఈ అధికారులు అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో జిల్లా స్థాయి విపత్తు నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించడం, ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ల నిర్వహణ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీసు, వైద్య శాఖల మధ్య సమన్వయం సాధించడం వంటి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా విపత్తుల సమయంలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలు, మాక్‌డ్రిల్స్ నిర్వహించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచడం వంటి కార్యక్రమాల్లోనూ ఈ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. విపత్తు నిర్వహణ సిబ్బంది కేవలం కార్యాలయ ఉద్యోగులు కాదని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడే ఫ్రంట్‌లైన్ బృందంగా పనిచేస్తున్నారని సీఎం రేఖా గుప్తా పేర్కొన్నారు. వారి సేవలకు గుర్తింపుగా తీసుకున్న ఈ నిర్ణయం... డీఎస్‌డీఎంఏ సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయంతో ఢిల్లీలో విపత్తు నిర్వహణ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## గుడ్ల గురవమ్మకు వైభవంగా
# ఆషాడమాస సారె

కాకతీయ, ఏలూరు ప్రతినిధి : మండలంలోని పాతూరు గ్రామ సమీపంలో వాలీసుగ్రీవుల గట్టు వద్ద శతాబ్దాల చరిత్ర ఉన్న శ్రీ గుడ్ల గురవమ్మ అమ్మవారికి ఆషాడమాస సారెను ఆదివారం గ్రామ మహిళలు అత్యంత వైభవంగా సమర్పించారు. ముందుగా పాతూరు రామాలయం నుంచి మేళతాళాలతో మహిళలు అందరూ భారీ ఊరేగింపుగా సారెను తీసుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు పీఎస్ఎల్వీ. ఆచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించిన అనంతరం సారెను సమర్పించారు. పలు రకాల పిండివంటలు, స్వీట్లు, పండ్లు, చీరలు అమ్మవారికి సమర్పించిన అనంతరం రక రకాల ప్రసాదాలను భక్తులకు పంచారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.











## బోనం..తెలంగాణ
# జీవనగీతం

- ఈ నేల సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం
- భక్తి, సంప్రదాయం, తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా బోనాలు
- గోల్కొండలో తొలి బోనంతో ఆషాఢ మహోత్సవాలకు అంకురార్పణ
- వెయ్యేళ్ల చరిత్రను మోస్తున్న తెలంగాణ ఆధ్యాత్మిక సంస్కృతి
- పోతరాజుల వీరనృత్యాలు... శివసత్తుల పూనకాలతో భక్తి ప్రవాహం
- గ్రామదేవతల ఆరాధనలో ప్రతిఫలించే ప్రకృతి-ప్రజల అనుబంధం



**ఆషాఢం అడుగుపెడితే తెలంగాణలో భక్తిభావం ఉప్పొంగుతుంది. ఎండలతో అలసిపోయిన భూమి తొలి వర్షపు చినుకులతో పరవశించినట్లు.. ప్రజల మనసులు కూడా అమ్మవారి నామస్మరణతో పులకించిపోతాయి. గల్లీ నుంచి గోల్కొండ వరకు, పల్లె నుంచి భాగ్యనగరం వరకు పసుపు పరిమళాలు వెదజల్లుతాయి. డప్పుల మోతలు మారుమోగుతాయి. పోతురాజుల వీరనృత్యాలు ఊరంతా ఉత్సాహాన్ని నింపుతాయి. శివసత్తుల పూనకాలతో ఆలయాలు ఆధ్యాత్మిక శక్తిని ప్రసరిస్తాయి. ప్రతి ఇంటి గుమ్మం ముందు ముగ్గులు, ప్రతి మహిళ చేతిలో పసుపు, కుంకుమ, తలపై బోనం... ఇవన్నీ కలిసి తెలంగాణ తన అసలు సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేస్తుంది. అందుకే బోనాలు కేవలం ఒక పండుగ కాదు... తెలంగాణ ఆత్మను ఆవిష్కరించే జీవన సంస్కృతి. గోల్కొండ కోటపై కొలువైన శ్రీ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ప్రతి ఏడాది ఈ మహోత్సవాలకు శ్రీకారం చుడతారు. ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వం తరపున బంగారు బోనం, పట్టువస్త్రాలను సమర్పించడంతో బోనాల సంబరాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజే కురిసిన వర్షాన్ని భక్తులు అమ్మవారి కరుణగా భావించారు. "అమ్మ అడుగుపెట్టగానే వరుణుడు కూడా వెంట వచ్చాడు" అని పెద్దలు చెప్పుకోవడం తెలంగాణ ప్రజల విశ్వాసానికి నిదర్శనం. వర్షం పడితే రైతు సంతోషిస్తాడు... బోనాలు వస్తే తెలంగాణ మొత్తం సంతోషిస్తుంది.**

### బోనం... నైవేద్యం కాదు... కృతజ్ఞత

బోనం అంటే కేవలం ఒక కుండ కాదు. అది ఒక తల్లి ప్రేమకు ప్రతీక. ఒక కుటుంబం కృతజ్ఞతకు చిహ్నం. కొత్త మట్టికుండలో అన్నం, బెల్లం, పాలు, పెరుగు, నెయ్యితో నైవేద్యం సిద్ధం చేసి, పసుపు, కుంకుమలతో అలంకరించి, వేపాకులు కట్టి, పైభాగంలో వెలిగే దీపంతో అమ్మవారికి సమర్పిస్తారు. "మా ఇంటిని కాపాడు... మా ఊరిని కాపాడు... పంటలు పండించు... అంటువ్యాధులు దూరం చేయి" అని తెలంగాణ మహిళ తన హృదయాన్ని బోనంలో పెట్టి అమ్మవారికి అర్పిస్తుంది. అందుకే బోనం ఒక నైవేద్యం మాత్రమే కాదు... విశ్వాసం, వినయం, వందనం. ఆషాఢ మాసంలోనే బోనాలు ఎందుకు జరుపుకుంటారనే ప్రశ్నకు తెలంగాణ సంప్రదాయం ఎంతో హృద్యమైన సమాధానం చెబుతుంది. కొత్తగా పెళ్లైన కుమార్తె ఆషాఢంలో పుట్టింటికి రావడం ఆనవాయితీ. జగన్మాత అయిన ఆ పరాశక్తి కూడా ఈ నెలలో తన పిల్లలను చూడటానికి పుట్టింటికి వస్తుందనే విశ్వాసంతో అమ్మవారిని కన్నకూతురిలా ఆహ్వానిస్తారు. చీర, సారె, పూలు, పండ్లు, పసుపు, కుంకుమలతో పాటు బోనం సమర్పించి ఆమెకు ఘన స్వాగతం పలుకుతారు. ఈ భావోద్వేగ బంధమే బోనాలను ఇతర పండుగల కంటే భిన్నంగా నిలబెట్టింది.

### వెయ్యేళ్ల ఆధ్యాత్మిక ప్రస్థానం

బోనాల మూలాలను వెతికితే చరిత్ర మనల్ని కాకతీయుల కాలానికి తీసుకెళ్తుంది. గ్రామదేవతల ఆరాధనకు అత్యున్నత స్థానం కల్పించిన కాకతీయులు తెలంగాణ సంస్కృతికి పునాది వేశారు. ప్రతాపరుద్రుడి కాలంలో గోల్కొండలోని జగదాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగేవని చరిత్రకారులు పేర్కొంటారు. కాలం మారింది... రాజులు మారారు... పాలకులు మారారు... కానీ అమ్మవారి ఆరాధన మాత్రం మారలేదు. కుతుబ్‌షాహీలు, ఆసఫ్‌జాహీలు కూడా ప్రజల విశ్వాసాన్ని గౌరవించారు. ఆలయాలకు భూములు కేటాయించారు. పూజలకు ఆటంకం కలగకుండా చూడటం ద్వారా ఈ సంస్కృతి తరతరాలకు అందేలా చేశారు. అందుకే బోనాలు మతాన్ని దాటి తెలంగాణ సామాజిక చరిత్రలో భాగమయ్యాయి. గోల్కొండలో ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక యాత్ర ఆ తర్వాత బల్కంపేట రేణుక ఎల్లమ్మ ఆలయానికి చేరుతుంది. అక్కడి నుంచి సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం, చివరగా లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి ఆలయంలో పరాకాష్టకు చేరుతుంది. నెల రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాలు హైదరాబాద్ నగరాన్ని ఒక ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్చేస్తాయి. ప్రతి బస్తీ, ప్రతి కాలనీ, ప్రతి వీధిలో అమ్మవారి ఘటాలు ఊరేగుతాయి. డప్పుల మోతకు చిన్నారులు నర్తిస్తారు. పెద్దలు భక్తిగీతాలు ఆలపిస్తారు. మహిళలు బోనాలు మోస్తారు. ఈ దృశ్యాలు తెలంగాణ సంస్కృతికి జీవం పోస్తాయి. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయానికి సంబంధించిన గాథ బోనాల చరిత్రలో ప్రత్యేక అధ్యాయం. బ్రిటిష్ సైన్యంలో పనిచేసిన సురటి అప్పయ్య ఉజ్జయినిలో కలరా మహమ్మారి విజృంభించిన రోజుల్లో మహంకాళి అమ్మవారిని ప్రార్థించి, ప్రజలు క్షేమంగా బయటపడితే సికింద్రాబాద్‌లో ఆలయం నిర్మిస్తానని మొక్కుకున్నారని చెబుతారు. మహమ్మారి తగ్గిన తర్వాత ఆయన తన మాట నిలబెట్టుకున్నారు. 1815లో మహంకాళి అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి 'లష్కర్ బోనాలు' తెలంగాణ ఆధ్యాత్మిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించాయి.

### పోతురాజు... రంగం... శివసత్తులు... బోనాల ఆత్మ

బోనాలంటే పోతురాజు గుర్తుకురాక మానదు. నడుముకు గంటలు, శరీరమంతా పసుపు, చేతిలో కొరడా... డప్పుల మోతకు తగ్గట్టు చేసే వీరనృత్యం కేవలం వినోదం కాదు. అమ్మవారికి మార్గం చూపే శక్తికి ప్రతీక. గ్రామంలో దుష్టశక్తులను పారదోలే రక్షకుడిగా పోతురాజును భావిస్తారు. అతని అడుగులు పడిన చోట భక్తి ఉప్పొంగుతుంది. అతడు నర్తిస్తుంటే ప్రజలు కేవలం చూస్తారు కాదు... తమలోని భయాలన్నింటినీ మరిచిపోతారు. అలాగే శివసత్తుల పూనకాలు, రంగం కార్యక్రమం బోనాల ప్రత్యేకతను మరింత పెంచుతాయి. పచ్చి మట్టి కుండపై నిలబడి భవిష్యవాణి వినిపించే ఆ సంప్రదాయం శతాబ్దాలుగా కొనసాగుతోంది. వర్షాలు ఎలా ఉంటాయి... పంటలు ఎలా పండుతాయి... ప్రజల జీవనం ఎలా ఉంటుంది... అన్నదానిపై చెప్పే మాటలను వేలాది మంది ఆసక్తిగా వింటారు. ఇది కేవలం ఆధ్యాత్మిక విశ్వాసమే కాదు... సమాజం ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతిబింబం. లాల్‌దర్వాజా బోనాల చరిత్ర కూడా విశిష్టమైనదే. 1907లో ఈ ఉత్సవాలకు మహారాజా కిషన్ శ్రీకారం చుట్టారని చరిత్ర చెబుతోంది. అప్పటి హైదరాబాద్ నవాబ్ మీర్ మహబూబ్ అలీఖాన్ ఆలయానికి భూమిని విరాళంగా ఇవ్వడమే కాకుండా, అనేక దేవాలయాల నిర్మాణానికి సహకరించడం బోనాల పండుగకు ఉన్న సామాజిక ఆమోదాన్ని తెలియజేస్తుంది.

### పండుగ కాదు... తెలంగాణ జీవన తత్వం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాలకు అధికారిక రాష్ట్ర పండుగ హోదా లభించింది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తూ ఆలయాల అభివృద్ధి, భద్రత, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, ట్రాఫిక్ నిర్వహణ వంటి ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి రూ.20 కోట్ల నిధులు కేటాయించి పెద్ద ఆలయాలతో పాటు చిన్న బస్తీ దేవాలయాలకు కూడా ఆర్థిక సహాయం అందించింది. లక్షలాది మంది భక్తులు పాల్గొనే ఈ ఉత్సవాల్లో జీహెచ్ఎంసీ, పోలీసు, వైద్యారోగ్య, విద్యుత్, జలమండలి తదితర శాఖలు సమన్వయంతో సేవలందిస్తున్నాయి. ప్రపంచం ఎంత వేగంగా మారినా... నగరాలు ఎంత ఆధునికమైనా... తెలంగాణ మహిళ నెత్తిపై బోనం పెట్టుకుని అమ్మవారి ఆలయానికి నడిచే అడుగులు ఆగవు. డప్పుల మోత ఆగదు. పోతురాజు నృత్యం ఆగదు. గ్రామదేవతలపై ప్రజల విశ్వాసం చెక్కుచెదరదు. అందుకే బోనాలు కేవలం పండుగ కాదు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సామాజిక జీవనం, స్త్రీశక్తి, ప్రకృతి ఆరాధన, సామూహిక విశ్వాసం... ఈ విలువలన్నింటినీ ఒకే వేదికపై నిలబెట్టే మహోత్సవం. ప్రతి ఆషాఢంలో తెలంగాణ ప్రజలు అమ్మవారిని ఆహ్వానించేది కేవలం ఆచారంగా కాదు... తమ మూలాలను, తమ సంస్కృతిని, తమ అస్తిత్వాన్ని మరో తరానికి అందించే జీవంతమైన సంప్రదాయంగా.

**అందుకే... ఆషాఢం వస్తే తెలంగాణలో పండుగ మొదలవదు... తెలంగాణ ఆత్మ మేల్కొంటుంది.**

- కాకతీయ,స్పెషల్ డెస్క్

## ప్రాజెక్టులపై తమిళనాడు సర్కార్
# కఠిన నిబంధనలు

- రూ.10 కోట్లకు పైబడిన పనులకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి
- పెద్ద ప్రాజెక్టులను చిన్న ప్యాకేజీలుగా విభజించడంపై నిషేధం
- ముందు జీతాలు, పెన్షన్లు... తర్వాతే కొత్త పనులకు నిధులు
- చెన్నై కార్పొరేషన్ ఆర్థిక సంక్షోభంతో కొత్త మార్గదర్శకాలు

కాకతీయ, చెన్నై : తమిళనాడులో పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన నియంత్రణలు అమలు చేయాలని నిర్ణయించింది. ఇకపై రూ.10 కోట్లకు మించిన ఏ అభివృద్ధి ప్రాజెక్టునైనా రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా చేపట్టరాదని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై శాఖ స్పష్టం చేసింది. అనుమతులను తప్పించుకునేందుకు భారీ ప్రాజెక్టులను చిన్న చిన్న ప్యాకేజీలుగా విభజించే విధానానికి పూర్తిగా చెక్ పెట్టేలా కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రభుత్వ పరిశీలనలో కొన్ని స్థానిక సంస్థలు నిబంధనలను పక్కనపెట్టి రూ.10 కోట్లకు పైబడిన పనులను కృత్రిమంగా చిన్న భాగాలుగా విభజించి, స్థానిక నిధులతో అమలు చేస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో 2021 నాటి నిబంధనలకు సవరణలు చేస్తూ కొత్త ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

### ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యం

కొత్త మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థలు కొత్త ప్రాజెక్టులకు నిధులు కేటాయించే ముందు ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, ప్రావిడెంట్ ఫండ్ వంటి అత్యవసర ఆర్థిక బాధ్యతలను ముందుగా తీర్చాల్సి ఉంటుంది. అందుబాటులో ఉన్న నిధులు సరిపోని పరిస్థితుల్లో కొత్త అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో తీవ్ర ఆర్థిక ఒత్తిడి నెలకొనడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. కార్పొరేషన్‌లో ద్రవ్య లోటు రూ.1,970 కోట్లకు చేరగా, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు దాదాపు రూ.2,000 కోట్లుగా పేరుకుపోయాయి. రానున్న ఆర్థిక సంవత్సరంలో మరో రూ.1,500 కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో మొత్తం పెండింగ్ బాధ్యతలు రూ.3,500 కోట్లకు చేరే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. పెద్ద మొత్తంలో సొంత నిధులతో ప్రాజెక్టులు చేపట్టడం, మౌలిక వసతుల అభివృద్ధి, నిర్వహణ వ్యయాలు పెరగడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అధికారులు వెల్లడించారు. ఆర్థిక క్రమశిక్షణతో పాటు పారదర్శకత పెంచడమే కొత్త నిబంధనల ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## నవోదయ ప్రవేశాలకు
# మరో అవకాశం

- దరఖాస్తు గడువు ఆగస్టు 7 వరకు పొడిగింపు
- 6వ తరగతి ప్రవేశాలకు ఉచితంగా దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన విద్యార్థులు అవకాశం వినియోగించుకోవాలని సూచన

కాకతీయ, తెలంగాణ బ్యూరో : దేశవ్యాప్తంగా ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027–28 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్షకు దరఖాస్తు గడువును నవోదయ విద్యాలయ సమితి పొడిగించింది. తొలుత జులై 31తో ముగియాల్సిన గడువును తాజా నిర్ణయంతో ఆగస్టు 7 రాత్రి 11.59 గంటల వరకు పొడిగించింది. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సమితి సూచించింది. దేశవ్యాప్తంగా ఉన్న 665 జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలు ఎంపిక పరీక్షలో సాధించిన ప్రతిభ ఆధారంగా కల్పించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 16 నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ఎంపికైన విద్యార్థులకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు పూర్తిగా ఉచిత విద్యతో పాటు వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు.

### అర్హతలు ఇవే

సంబంధిత నవోదయ విద్యాలయం ఉన్న జిల్లాకు చెందిన నివాసి కావాలి. 3, 4, 5 తరగతులను గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదివి ఉండాలి. విద్యార్థి మే 1, 2015 నుంచి జులై 31, 2017 మధ్య జన్మించి ఉండాలి. 2026–27 విద్యా సంవత్సరంలో అదే జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న వారే దరఖాస్తుకు అర్హులు. దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఉచితం. నవోదయ విద్యాలయ సమితి అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు. మొత్తం సీట్లలో 75 శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కేటాయించగా, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. అర్హత కలిగిన విద్యార్థులు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఉత్తరం కాకతీయ

సోమవారం 03 ఆగష్టు 2026 04

# తెలుగు రాష్ట్రాలకు గ్రీన్ కారిడార్

**ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రాకపోకలకు గ్రీన్ సిగ్నల్**
**రూ.3,573 కోట్లతో 165 కి.మీ. ఆధునిక ఎక్స్‌ప్రెస్‌వే సిద్ధం**
**హైదరాబాద్-ఉత్తరాంధ్ర ప్రయాణ సమయం సగానికి తగ్గింపు**
**2017 నుంచి కృషి ఫలించింది...**
**హైవేపై ప్రయాణించిన మంత్రి తుమ్మల**
**రైతులు, పరిశ్రమలు, రవాణా రంగానికి కొత్త ఊపు**



కాకతీయ, ఖమ్మం : తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా రంగంలో మరో కీలక అధ్యాయానికి తెరలేచింది. దాదాపు దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తికావడంతో రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. రూ.3,573 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి రావడంతో హైదరాబాద్ నుంచి రాజమండ్రి, విశాఖపట్నం, ఉత్తరాంధ్ర, పశ్చిమ బెంగాల్ వైపు ప్రయాణం మరింత వేగవంతం కానుంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా హైవేపై ప్రయాణించి పనులను పరిశీలించడం ప్రాధాన్యత సంతరించుకుంది. మంత్రి తుమ్మల గతంలో రోడ్లు–భవనాల శాఖ మంత్రిగా ఉన్నప్పటి నుంచే ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సహకారంతో ప్రాజెక్టు రూపుదిద్దుకోగా, ఆగస్టు 1 నుంచి వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతులు ఇవ్వడంతో ప్రజలు ఇప్పటికే ఈ మార్గాన్ని వినియోగించడం ప్రారంభించారు.

## ఏడేళ్ల కృషికి ఫలితం

ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం మంత్రి తుమ్మల 2017 నుంచే నిరంతర కృషి చేశారు. అప్పటి కేంద్ర రహదారుల కార్యదర్శి గిరిధర్ సహకారంతో డీపీఆర్ సిద్ధం చేయించి, భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయించారు. అనంతరం టెండర్లు, నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ధ్వంసలాపురం, కల్లూరు, వేంసూరు ప్రాంతాల్లో అదనపు ఎగ్జిట్ పాయింట్లు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. దీంతో స్థానిక ప్రజలకు ఈ హైవే మరింత అందుబాటులోకి వచ్చింది. హైవే పూర్తయిన తర్వాత మంత్రి తుమ్మల స్వయంగా ఈ మార్గంలో ప్రయాణించి పనులను పరిశీలించడం విశేషంగా మారింది. "ఎన్నేళ్లుగా పడిన శ్రమ ఫలించింది. ఇది కేవలం రహదారి కాదు... రెండు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి వారధి" అని ఆయన పేర్కొన్నట్లు సమాచారం.

## ప్రయాణ సమయం సగానికి తగ్గింపు

భారత్‌మాల ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా నిర్మించిన ఈ హైవే తెలంగాణలోని తల్లంపాడు నుంచి ప్రారంభమై, ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి వద్ద జాతీయ రహదారి–16తో కలుస్తుంది. మొత్తం 165 కిలోమీటర్ల పొడవున్న ఈ మార్గంలో తెలంగాణలో 90 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 75 కిలోమీటర్లు ఉన్నాయి. ఈ హైవే అందుబాటులోకి రావడంతో హైదరాబాద్ నుంచి రాజమండ్రి, విశాఖపట్నం వెళ్లే వాహనాలు విజయవాడ మీదుగా వెళ్లాల్సిన అవసరం ఉండదు. దూరం గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా భారీగా ఆదా కానుంది. ఇప్పటి వరకు నాలుగు నుంచి ఆరు గంటలు పట్టే ప్రయాణం ఇకపై రెండున్నర గంటల్లోనే పూర్తయ్యే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్ వైపు రవాణా కూడా మరింత సులభతరం కానుంది.

## తెలుగు రాష్ట్రాల్లో తొలి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే

ఈ రహదారి తెలుగు రాష్ట్రాల్లోనే తొలి యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్‌ఫీల్డ్ హైవేగా గుర్తింపు పొందింది. నిర్ణీత ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల ద్వారానే వాహనాల ప్రవేశానికి అనుమతి ఉండేలా నిర్మించారు. ప్రతి 18 కిలోమీటర్లకు ఒక ఎంట్రీ–ఎగ్జిట్, ప్రతి ఐదు కిలోమీటర్లకు అత్యవసర మార్గాలు ఏర్పాటు చేశారు. అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో రూపొందించిన ఈ హైవేపై ఏఐ ఆధారిత కెమెరాలు, 360 డిగ్రీల సీసీ కెమెరాలు, అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సోలార్ లైటింగ్, క్లోజ్డ్ టోలింగ్ విధానం అమలు చేస్తున్నారు. అతివేగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, సీట్‌బెల్ట్ నిబంధనల ఉల్లంఘనలను కెమెరాలే గుర్తించి నేరుగా చలాన్లు జారీ చేయనున్నాయి. ప్రతి 50 కిలోమీటర్లకు వే సైడ్ అమెనిటీస్ ఏర్పాటు చేసి హోటళ్లు, పెట్రోల్ బంకులు, పార్కింగ్, వాష్‌రూమ్‌లు అందుబాటులో ఉంచుతున్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా అత్యవసర సేవల వివరాలు తెలుసుకునే సౌకర్యం కూడా కల్పించారు.

## రైతులకు... పరిశ్రమలకు వరం

ఈ హైవే వల్ల ఖమ్మం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా వేగవంతం కానుంది. మార్కెట్లకు సరుకు తక్కువ సమయంలో చేరడంతో రవాణా వ్యయం తగ్గనుంది. హైవే వెంట గిడ్డంగులు, లాజిస్టిక్స్ పార్కులు, పరిశ్రమలు, వాణిజ్య కేంద్రాలు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రయాణికులకు వేగవంతమైన ప్రయాణం... రైతులకు మార్కెట్ అనుసంధానం... పరిశ్రమలకు రవాణా సౌలభ్యం... ఖమ్మం–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కొత్త దారులు తెరుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఆగస్టు 6న సరూర్‌నగర్‌లో సంకల్ప సభ

**తెలంగాణ రక్షణ సేన పార్టీ నేతల పిలుపు**
**ఖమ్మంలో టీఆర్ఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్ల విడుదల**



కాకతీయ, ఖమ్మం టౌన్ : తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తలపెట్టిన 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' పోస్టర్లను ఆదివారం ఖమ్మంలో ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ గట్టు కరుణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆగస్టు 6న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే సంకల్ప సభకు ఖమ్మం జిల్లా నుంచి విద్యార్థులు, యువకులు, కార్మికులు, రైతులు, మేధావులు, మహిళలు, వివిధ సామాజిక వర్గాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భౌగోళిక తెలంగాణ సాధించినప్పటికీ సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం మరో దశ పోరాటం అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల శివారెడ్డి, రాష్ట్ర నాయకులు బానోత్ కిషన్ నాయక్, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి రవి రాథోడ్, పగిడిపల్లి వినోద్ కుమార్, కూరపాటి సురేష్ కుమార్, కొల్లా రఘురాం, పోతురాజు రమాదేవి, జలా శివ యాదవ్, అభిషేక్ రెడ్డి, గౌతమ్ రెడ్డి, రామ్ భూపాల్ రెడ్డి, సాయికుమార్ గౌడ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా రేపల్లెవాడ బీటీ రోడ్డు

- పెద్ద గుంతలతో ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రధాన మార్గం
- నాచారం వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్



కాకతీయ, ఏన్కూర్ : ఏన్కూర్ మండల కేంద్రం నుంచి రేపల్లెవాడ మీదుగా నాచారం శ్రీ అద్భుత వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే ప్రధాన బీటీ రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ముఖ్యంగా రేపల్లెవాడ గ్రామ పరిధిలో భారీ గుంతలు ఏర్పడి రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవలి వర్షాలతో రోడ్డు మధ్యలో నీరు నిలిచిపోవడంతో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వాహనదారులతో పాటు నాచారం శ్రీ అద్భుత వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి వచ్చే వేలాది మంది భక్తులు ప్రయాణిస్తున్నప్పటికీ, రహదారి మరమ్మతులపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే శాశ్వత మరమ్మతులు చేపట్టి రహదారిని ప్రయాణయోగ్యంగా మార్చాలని స్థానికులు, భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# చిట్టీల పేరుతో రూ.5 కోట్ల మోసం.. కుటుంబంతో పరార్!

- రాజేంద్రనగర్ బుద్వేల్‌లో కలకలం
- ఇంటికి తాళం వేసి అదృశ్యమైన నిర్వాహకుడు
- డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ బాధితుల ఆందోళన



కాకతీయ, తెలంగాణ బ్యూరో : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ ప్రాంతంలో చిట్టీల పేరుతో సుమారు రూ.5 కోట్ల మేర మోసం జరిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా నివాసం ఉంటున్న అశోక్, అతని భార్య కలిసి కొంతకాలంగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, అధిక లాభాలు వస్తాయని నమ్మించి పలువురి నుంచి భారీ మొత్తంలో నగదు సేకరించినట్లు తెలిపారు. బాధితుల కథనం ప్రకారం, చిట్టీల చెల్లింపులు కొన్ని రోజులుగా నిలిచిపోవడంతో అశోక్‌ను సంప్రదించే ప్రయత్నం చేశారు. అయితే ఇటీవల అతను కుటుంబ సభ్యులతో కలిసి రాత్రికి రాత్రే ఇంటికి తాళం వేసి పరారైనట్లు గుర్తించారు. దీంతో తమను మోసం చేసినట్లు గ్రహించిన బాధితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితులు అశోక్ నివాసం ఎదుట పెద్ద ఎత్తున చేరుకుని నిరసన తెలిపారు. కష్టపడి సంపాదించిన పొదుపు మొత్తాన్ని చిట్టీల్లో పెట్టామని, ఇప్పుడు కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని, తమ సొమ్ము తిరిగి ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చిట్టీల్లో పెట్టుబడులు పెట్టే ముందు నిర్వాహకుల విశ్వసనీయత, చట్టబద్ధతను పూర్తిగా నిర్ధారించుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

# కడుపులోనే కూతురికి మరణశిక్ష..!

(మొదటి పేజీ తరువాయి)



అత్యవసర పరిస్థితుల్లో మరో ఆస్పత్రికి తరలించే వ్యక్తి... ఇలా మొత్తం గొలుసు పనిచేస్తుందని దర్యాప్తు సంస్థలు చెబుతున్నాయి. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు లేదా అనధికార వైద్యుల ద్వారా ఈ నెట్‌వర్క్ నడుస్తోందనే అనుమానాలు ఉన్నాయి. అధికారిక రికార్డుల్లో ఎక్కడా కనిపించకుండా నగదు లావాదేవీలతో ఈ వ్యవహారం ముగిసిపోతుంది.

## మహిళల ప్రాణాలతో చెలగాటం

చట్టబద్ధ ఆస్పత్రుల్లో అవసరమైన పరీక్షలు, రక్తపరీక్షలు, అత్యవసర చికిత్స సదుపాయాలు ఉంటాయి. కానీ అక్రమ గర్భస్రావాల్లో అలాంటి భద్రత ఉండదు. ఇళ్లలో, చిన్న క్లినిక్‌లలో లేదా అనుమతులు లేని కేంద్రాల్లో చేసే గర్భస్రావాల వల్ల అధిక రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్లు, గర్భాశయం దెబ్బతినడం, భవిష్యత్తులో సంతానలేమి, చివరకు మరణాలు కూడా సంభవించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జనగామ ఘటనలో కూడా గర్భస్రావం అనంతరం తీవ్ర రక్తస్రావంతో గర్భిణి ప్రాణాలు కోల్పోవడం ఈ ప్రమాదాన్ని మరోసారి గుర్తుచేసింది. దేశంలో ప్రీ–కన్సెప్షన్ అండ్ ప్రీ–నేటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టం అమల్లో ఉంది. ఈ చట్టం ప్రకారం గర్భస్థ శిశువు లింగాన్ని నిర్ధారించడం, వెల్లడించడం, ప్రచారం చేయడం నేరం. అలాగే మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం ప్రకారం నిర్దిష్ట వైద్య కారణాలు, అనుమతులు, అర్హత కలిగిన వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే గర్భస్రావం చేయాలి. అయినప్పటికీ అక్రమ గర్భస్రావాల ముఠాలు ఇంకా కొనసాగుతుండటం... చట్టాల అమలులో లోపాలపైనా ప్రశ్నలు లేవనెత్తుతోంది.

## తనిఖీలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా..?

రాష్ట్రంలో స్కానింగ్ కేంద్రాల తనిఖీలు ఎంత తరచుగా జరుగుతున్నాయి? నమోదైన కేంద్రాలతో పాటు అనుమానాస్పదంగా పనిచేస్తున్న కేంద్రాలపై నిఘా ఉందా? ఆర్ఎంపీల కార్యకలాపాలను ఎవరు పర్యవేక్షిస్తున్నారు? అక్రమ గర్భస్రావాలపై జిల్లా స్థాయిలో ప్రత్యేక నిఘా వ్యవస్థ పనిచేస్తోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాతే చర్యలు తీసుకోవడం కాకుండా... ముందస్తు పర్యవేక్షణ బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఆడపిల్ల పుట్టడాన్ని ఇంకా భారంగా చూసే సామాజిక మనస్తత్వమే ఇలాంటి నేరాలకు మూల కారణమని సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కుటుంబాల్లో కుమారుడిపైనే ఆశలు పెట్టుకోవడం, ఆస్తి, వంశపారంపర్యం వంటి భావనలు ఇప్పటికీ పూర్తిగా మారకపోవడం వల్లే కొందరు చట్టవిరుద్ధ మార్గాలను ఆశ్రయిస్తున్నారని చెబుతున్నారు. అవగాహన కార్యక్రమాలతో పాటు మహిళలపై వివక్షను తగ్గించే సామాజిక మార్పు కూడా అవసరమని వారు సూచిస్తున్నారు.

## ఉక్కుపాదం అవసరం

అక్రమ గర్భస్రావం అనేది కేవలం వైద్య నేరం మాత్రమే కాదు... గర్భస్థ శిశువు జీవించే హక్కును హరించే ఘోరమైన సామాజిక నేరం. స్కానింగ్ కేంద్రాలపై నిరంతర తనిఖీలు, మధ్యవర్తులపై కఠిన చర్యలు, అక్రమ వైద్యకేంద్రాల గుర్తింపు, ప్రజలనుంచి సమాచార సేకరణవ్యవస్థను బలోపేతం చేయకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉంది. జనగామ ఘటన ఒక కేసు మాత్రమే కావచ్చు... కానీ దాని వెనుక ఉన్న అక్రమ నెట్‌వర్క్‌పై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరాన్ని ఈ ఘటన స్పష్టంగా గుర్తు చేస్తోంది.

# వారం రోజుల్లోనే జడ్జి బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

అయితే డిఫెన్స్ కౌన్సిల్ అభ్యర్థన మేరకు విచారణ వాయిదా పడింది. అనంతరం సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్, ఇద్దరు నిందితుల బెయిల్ పిటిషన్ల పరిశీలన కోసం కేసును సోమవారానికి వాయిదా వేశారు. ఈ కేసులో ఇప్పటికే 13 మంది నిందితులపై సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేయగా, వారంతా ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఇదే సమయంలో కోర్టులో జడ్జి మార్పు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు, నీట్ పేపర్ లీక్ వ్యవహారంతో పాటు ఇటీవల జరిగిన నిరసనల్లో పోలీసులు వ్యవహరించిన తీరుపై దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను పరిశీలించనుంది.సిట్ ఏర్పాటు దిశగా..?నిరసనకారులు, పెల్లెట్ గన్ బాధితులు చేసిన ఆరోపణలపై స్వతంత్ర విచారణ అవసరమని పిటిషన్లలో కోరారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నిరసనల సమయంలో జరిగిన ఘటనలపై సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ రికార్డింగ్‌లు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ రికార్డులు, పీసీఆర్ లాగ్‌లు తదితర డిజిటల్ ఆధారాలను భద్రపరచాలని ఇప్పటికే మధ్యంతర ఆదేశాలు జారీ చేసినట్లు పిటిషన్లలో పేర్కొన్నారు. పేపర్ లీక్ కేసులను వేగంగా పరిష్కరించేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అదే క్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులో జడ్జి మార్పు చోటుచేసుకోవడం న్యాయ, రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కొత్త జడ్జి అజయ్ గుప్తా బాధ్యతలు చేపట్టిన తర్వాత నీట్ పేపర్ లీక్ కేసు విచారణ ఎలా ముందుకు సాగుతుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది.

# మల్లన్నకు మరో రాజకీయ పరీక్ష..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటంతో ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. అదే గుర్తింపు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు గణనీయమైన ఓట్లను సాధించేలా చేసింది. అనంతరం కాంగ్రెస్‌లో చేరి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కానీ కాంగ్రెస్‌తో విభేదాల తర్వాత తెలంగాణ రాజ్యాధికార పార్టీని ఏర్పాటు చేసి సొంత రాజకీయ వేదికను నిర్మించుకునే దిశగా అడుగులు వేశారు. దీంతో ఇప్పటివరకు వ్యక్తిగత ఇమేజ్‌పై సాగిన రాజకీయ ప్రయాణం... ఇప్పుడు పార్టీ నిర్మాణం వైపు మళ్లినట్లుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## పార్టీ ఉంది... క్యాడర్ ఎంత బలంగా ఉంది..?

రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం ఒక దశ అయితే... దానిని ఎన్నికల్లో గెలిపించే స్థాయికి తీసుకెళ్లడం మరో దశ. ప్రస్తుతం టీఆర్‌పీ విషయంలో ఇదే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. మూడు ఉమ్మడి జిల్లాల్లో పార్టీకి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీలు ఎంతవరకు ఏర్పడ్డాయి? బూత్ స్థాయిలో కార్యకర్తల వ్యవస్థ ఎంత బలంగా ఉంది? గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు పార్టీ యంత్రాంగం సమర్థంగా పనిచేసే పరిస్థితి ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లా పార్టీ గుర్తింపు మాత్రమే సరిపోదు. నమోదైన ప్రతి పట్టభద్రుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకురావడం, ప్రాధాన్యత ఓటు విధానంపై అవగాహన కల్పించడం, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలు కూడా గెలుపోటములను ప్రభావితం చేస్తాయి.

## పాదయాత్ర... పార్టీ విస్తరణకేనా..?

మల్లన్న చేపట్టబోయే పాదయాత్రను రాజకీయ విశ్లేషకులు కేవలం ప్రచార కార్యక్రమంగా చూడడం లేదు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసే ప్రక్రియగా కూడా అంచనా వేస్తున్నారు. మూడు జిల్లాల్లో కొత్త నాయకత్వాన్ని గుర్తించడం, పార్టీ కమిటీలను విస్తరించడం, పట్టభద్రుల సంఘాలు, ఉద్యోగార్థుల సంఘాలతో సంబంధాలను బలోపేతం చేయడం వంటి అంశాలపై ఈ పాదయాత్రలో ప్రధాన దృష్టి ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మూడు ప్రధాన పార్టీల మధ్య టీఆర్‌పీ స్థానం..?

రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార పార్టీగా తన పూర్తి యంత్రాంగాన్ని రంగంలోకి దించే అవకాశం ఉంది. బీజేపీ కూడా పట్టభద్రుల నియోజకవర్గాల్లో పట్టు సాధించేందుకు ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. బీఆర్ఎస్ కూడా ఈ స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు వ్యూహాలు సిద్ధం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎలాంటి రాజకీయ స్థానం సంపాదించుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ప్రధాన పార్టీలకు భిన్నంగా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా నిలబడగలదా? లేక వ్యక్తిగత ప్రజాదరణకే పరిమితమవుతుందా? అన్నదానిపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వ్యక్తిగత విమర్శలు లేదా భావోద్వేగాల కంటే ఉద్యోగాలు, ప్రభుత్వ నియామకాలు, ప్రైవేట్ రంగ ఉపాధి, పరిశ్రమలు, ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలకే పట్టభద్రులు అధిక ప్రాధాన్యం ఇస్తారనే అభిప్రాయం ఉంది.

## మల్లన్నకు మాత్రమే కాదు... టీఆర్‌పీకీ అగ్నిపరీక్షే

రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికను రాజకీయ పరిశీలకులు కేవలం మల్లన్న వ్యక్తిగత పోటీగా చూడడం లేదు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాజకీయంగా ఎంత మేర విస్తరించిందో, ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా నిలబడే సామర్థ్యం ఎంత ఉందో అంచనా వేసే తొలి ప్రధాన ఎన్నికగా భావిస్తున్నారు. ఒకవైపు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల బలమైన సంస్థాగత వ్యవస్థ... మరోవైపు టీఆర్‌పీ పార్టీ విస్తరణ ప్రయత్నాలు... ఈ రెండింటి మధ్య జరిగే పోటీ ఆసక్తికరంగా మారనుంది. పాదయాత్రతో పార్టీకి కొత్త ఊపు వస్తుందా? పట్టభద్రుల ఓటర్లలో టీఆర్‌పీ ప్రభావం పెరుగుతుందా? లేక సంప్రదాయ పార్టీల ఆధిపత్యమే కొనసాగుతుందా? అన్న ప్రశ్నలకు సమాధానం రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే తేలనుంది.

# ఎరువులకు లింకులు... అన్నదాతకు తిప్పలు..!



- లింక్ లేకుంటే బస్తాలు లేవంటున్న గ్రోమోర్ సెంటర్లు
- ఎమ్మార్పీ కంటే అదనంగా వసూళ్లంటూ రైతుల ఆరోపణలు
- బలవంతంగా ఇతర ఉత్పత్తులను అంటగడుతున్న వ్యాపారులు
- తనిఖీలకు దూరంగా వ్యవసాయ శాఖ... కలెక్టర్ జోక్యం కోరుతున్న రైతులు

**ములుగు జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో ఎరువుల కోసం గ్రోమోర్ సెంటర్లు, ఫర్టిలైజర్ దుకాణాల వద్దకు వెళ్తున్న రైతులకు కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. అవసరమైన కాంప్లెక్స్ ఎరువులు కొనాలంటే వాటితో పాటు తప్పనిసరిగా పురుగుమందులు, సూక్ష్మపోషకాలు, గ్రోత్ ప్రమోటర్లు లేదా ఇతర వ్యవసాయ ఉత్పత్తులు కూడా కొనుగోలు చేయాలని కొందరు డీలర్లు ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదనపు ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి నిరాకరిస్తే ఎరువులు ఇవ్వకుండా తిరస్కరించడం లేదా ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి అప్పుల ఊబిలో కూరుకు పోయిన చిన్న, సన్నకారు రైతులపై ఈ విధానం మరింత భారంగా మారిందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.**

**కాకతీయ, ములుగు ప్రతినిధి :**

### 'లింక్' లేకుంటే ఎరువులే లేవా..?

జిల్లాలోని పలుచోట్ల రైతులు కోరిన ఎరువులు మాత్రమే ఇవ్వకుండా వాటితో పాటు ఇతర ఉత్పత్తులు కూడా కొనుగోలు చేస్తేనే బస్తాలు ఇస్తామని షరతులు విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అవసరం లేకపోయినా అదనపు వస్తువులు కొనాల్సి రావడంతో ఒక్కో రైతుపై వందల నుంచి వేల రూపాయల వరకు అదనపు భారం పడుతోందని చెబుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని లింక్ సేల్స్ పేరుతో వ్యాపారం చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ఎమ్మార్పీపై అదనపు వసూళ్లు..!

లింక్ ఉత్పత్తులు కొనుగోలు చేయని రైతుల నుంచి ఎరువుల బస్తాకు ఎమ్మార్పీ కంటే రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. బిల్లుల్లో పూర్తి వివరాలు ఇవ్వకుండా, ధరలపై ప్రశ్నిస్తే ఎరువులు ఇవ్వబోమంటూ బెదిరిస్తున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. యూరియా కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక యాప్‌లో బుకింగ్ చేసుకుని గ్రోమోర్ సెంటర్‌కు వెళ్లిన తర్వాత కూడా లింక్ ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సిందేనని షరతులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

### అప్పు రైతుకు మరింత భారం

జిల్లాలో ఎక్కువ మంది రైతులు పంట అమ్మిన తర్వాత చెల్లించే విధానంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేస్తుంటారు. ఇప్పటికే అధిక పెట్టుబడులు, వడ్డీలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు ఇప్పుడు బలవంతపు లింక్ విక్రయాలు మరో ఆర్థిక భారంగా మారాయని రైతు సంఘాలు చెబుతున్నాయి. పంట దిగుబడులపై అనిశ్చితి ఉన్న సమయంలో అదనపు ఖర్చులు రైతులను మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తనిఖీలు ఎక్కడ..?

జిల్లాలో ఎరువుల దుకాణాలు, గ్రోమోర్ సెంటర్లలో జరుగుతున్న ఈ వ్యవహారంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లింక్ విక్రయాలు, ఎమ్మార్పీ కంటే అధిక ధరల వసూళ్లు జరుగుతున్నాయా లేదా అన్న అంశంపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### కఠిన చర్యలు తీసుకోవాలి
### : కొండం రవీందర్ రెడ్డి,ములుగు ఆత్మ కమిటీ చైర్మన్



ఎరువులతో పాటు ఇతర ఉత్పత్తులు బలవంతంగా కొనిపించడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. జిల్లా వ్యవసాయ శాఖ వెంటనే ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అధిక ధరలకు, లింకుల ద్వారా ఎరువులు పంపిన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

### ఎరువు మందులకు లింకులు పెట్టి అమ్ముతున్నారు
### : రైతు దూడల రమేష్, చల్వాయి గ్రామం



నాకు అవసరమైన కాంప్లెక్స్ ఎరువులు అడిగితే ముందుగా పోషకాల మందులు కొనాలని అని లింకులు పెడుతున్నారు. అవసరం లేకపోయినా కొనాల్సి వస్తుంది. రైతుకు అవసరమైన ఎరువులు ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్మేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటే రైతులకు మేలు చేసిన వారు అవుతారు.

# కొండాపూర్‌లో బీఆర్ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లో 50 మంది నాయకుల చేరిక
- కడియం శ్రీహరి సమక్షంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం
- ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, యువకుల చేరిక



కాకతీయ, స్టేషన్ ఘనపూర్ : స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని చిల్పూర్ మండలం కొండాపూర్ గ్రామంలో బీఆర్ఎస్‌కు ఎదురు దెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన సుమారు 50 మంది యువకులు, ముదిరాజ్ సామాజిక వర్గ నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఉన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జక్కుల వీరయ్య, చొక్కం సంపత్, చొక్కం రమేష్, రాజు, నాగరాజు, అజయ్, లింగనబోయిన రమేష్, ఇట్టబోయిన రాజశేఖర్, రాయగిరి సత్యం, పెద్ద వీరయ్య, మోతే రాహుల్, రంజిత్‌తో పాటు మరో పలువురు ఉన్నారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాలకు చేరువవుతున్నందునే వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, మాజీ ఎంపీపీ బాలరాజు, కొండాపూర్ గ్రామ ఉప సర్పంచ్ నరేష్, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




# గీత నేర్చుకో... రాత మార్చుకో

- ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారంలో ఇందూ జ్ఞానవేదిక సభ్యులు
- త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రతి ఇంటికి చేర్చడమే లక్ష్యం

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : త్రైత సిద్ధాంత భగవద్గీతను అధ్యయనం చేసి ఆచరించడం ద్వారా మానవుడు ఆధ్యాత్మిక వికాసాన్ని సాధించవచ్చని ఇందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవా సమితి మహబూబాబాద్, జమ్మికుంట, హనుమకొండ శాఖ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా మడికొండలో త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటు అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాలపై ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటు అనుబంధ ఆధ్యాత్మిక గ్రంథాల సారాంశాన్ని తెలుసుకుని ఆచరణలో పెట్టడం ద్వారా మానవ జీవితం సార్థకమవుతుందని తెలిపారు. శ్రీకృష్ణుడు బోధించిన మోక్షమార్గాన్ని అర్థం చేసుకుని జీవన విధానంలో అనుసరించడం ద్వారా ఆధ్యాత్మిక పరిపూర్ణత సాధించవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత గ్రంథాలను అధ్యయనం చేసి సన్మార్గంలో పయనించాలని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిప్ప సుధాకర్, రాజలింగం, సిద్ధయ్య, వీరస్వామి, సుమన్, వంశీ, సన్నీ, చైతన్య, విజయలలిత, విమల, రేఖ, స్వరూప, సుష్మ, సుమలత, ఇందుశ్రీ, వీరలక్ష్మి, ధన్విక, రేవతి, వెంకట్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- రూ.58,970 విలువైన మద్యం, బీర్లు స్వాధీనం
- అక్రమ నిల్వలు గుర్తించి కేసు నమోదు..వ్యక్తి అరెస్ట్
- నిందితుడిని హసన్‌పర్తి పోలీసులకు అప్పగింత



కాకతీయ, హన్మకొండ : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ఆర్వపల్లి గ్రామ శివారులో అనుమతి లేకుండా ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ విక్రయిస్తున్న వ్యక్తిని వరంగల్ పోలీస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.58,970 విలువైన వివిధ బ్రాండ్ల మద్యం, బీర్లు, వైన్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్‌కు అందిన సమాచారంతో ఓ ఇంటిపై ఆకస్మిక దాడులు నిర్వహించగా, ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రాయల్ స్టాగ్, ఐబీ, ఓసీ, 8 పీఎం, బ్లెండర్స్ ప్రైడ్, ఆంటిక్విటీ, బ్రిజర్, లైకా రెడ్ వైన్, కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్, కింగ్‌ఫిషర్ లైట్ తదితర బ్రాండ్లకు చెందిన మద్యం సీసాలు, బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఆర్వపల్లి గ్రామానికి చెందిన దూళం సాంబయ్యను అదుపులోకి తీసుకుని, స్వాధీనం చేసుకున్న మద్యంతో పాటు తదుపరి చర్యల కోసం హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. దాడిలో ఏసీపీ ఎ. మధుసూదన్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జి. బాబులాల్, ఎస్ఐ కె. సుధాకర్‌తో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# హన్మకొండలో కాంగ్రెస్‌కు షాక్

**62వ డివిజన్‌లో బీజేపీలోకి కీలక నేతల చేరిక**



కాకతీయ, హనుమకొండ : హనుమకొండ నగరంలోని 62వ డివిజన్ పరిధి సోమిడి హనుమాన్‌నగర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం భారతీయ జనతా పార్టీలో చేరారు. డివిజన్ అధ్యక్షుడు మేకల శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఓరుగల్లు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాజీపేట రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్, మామునూర్ విమానాశ్రయ అభివృద్ధి, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. జక్కుల రాజు యాదవ్, జక్కుల రంజిత్, రమేష్, ఆదిత్య, కాయిత రాజ్‌కుమార్, సాయికృష్ణ, జంపుల్, అభినవ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీడబ్ల్యూఎంసీ ఎన్నికలపై బీజేపీ ఫోకస్

- డివిజన్ల వారీగా జోనల్, డివిజన్ ఇన్‌ఛార్జుల నియామకం
- క్షేత్రస్థాయిలో ఎన్నికల వ్యూహాల అమలుకు శ్రీకారం
- విజయమే లక్ష్యమని జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ వెల్లడి

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భారతీయ జనతా పార్టీ ఎన్నికల సన్నాహాలను వేగవంతం చేసింది. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు డివిజన్ల వారీగా జోనల్, డివిజన్ ఇన్‌ఛార్జులు, కన్వీనర్లను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి, జిల్లా ఇన్‌ఛార్జ్ కొండపల్లి శ్రీధర్ రెడ్డి సూచనల మేరకు ఈ కమిటీలను ఖరారు చేసినట్లు తెలిపారు. జోనల్ ఇన్‌ఛార్జ్‌గా గుడుపూడి రాధాకృష్ణను నియమించారు. డివిజన్ ఇన్‌ఛార్జులుగా బికే రాజు, విప్పా సుధాకర్, బోడిరెడ్డి ప్రతాప్ రెడ్డి, డాక్టర్ వన్నాల వెంకటరమణ, కొండేటి శ్రీధర్, రత్నం సతీష్‌లకు బాధ్యతలు అప్పగించారు. డివిజన్ కన్వీనర్లుగా కె. త్రిలోకేశ్వరరావు, ఠాకూర్ మహేందర్ సింగ్, గుంథికా శ్రీధర్, బైరి మురళీకృష్ణ, కందుకూరి శ్రీనివాస్, గుర్రాల చంద్రమౌళి తదితరులను నియమించారు. ప్రతి డివిజన్‌లో పార్టీని బలోపేతం చేసి ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రజల్లోకి వెళ్లి పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని నియమిత నాయకులకు గంట రవికుమార్ పిలుపునిచ్చారు.

# మహంకాళి ఆలయంలో భక్తుల సందడి

- పంచామృతాభిషేకం, విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు
- బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు



కాకతీయ, హన్మకొండ : ఆషాడ మాసం చివరి ఆదివారం సందర్భంగా హనుమకొండ జిల్లా మడికొండలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి మంత్రవాది వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, పంచవర్ణాభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించి నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, కుంకుమ పూజలు, మంగళహారతులు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుని దర్శనం చేసుకున్నారు. దువ్వ జిజియా కుమార్ దంపతులు ప్రత్యేక బోనం సమర్పించగా, దువ్వ విజయ, రాజేశ్వరి, స్వప్న, సరస్వతి, చాముండి, లక్ష్మి స్వరూప, సంధ్యతో పాటు పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు. ఆషాడ మాసంలో మహంకాళి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే కుటుంబాలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలుగుతాయని ప్రధాన పూజారి మంత్రవాది వెంకటప్రసాద్ తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# పదవీ విరమణ బకాయిలు వెంటనే చెల్లించాలి

**టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి చుంచుకాల లింగారావు**

**రిటైర్డ్ ఉద్యోగులకు అన్ని బెనిఫిట్స్ విడుదల చేయాలని డిమాండ్**



కాకతీయ, హన్మకొండ : ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రావలసిన అన్ని పదవీ విరమణ ప్రయోజనాలను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి చుంచుకాల లింగారావు డిమాండ్ చేశారు. రాంపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెన్నవరం రామచంద్రారెడ్డి పదవీ విరమణ సన్మాన సభలో ఆయన మాట్లాడారు. విద్యాభివృద్ధికి రామచంద్రారెడ్డి చేసిన సేవలు ఆదర్శప్రాయమని, విద్యార్థుల సంఖ్య పెంపు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం కూడా తన అనుభవాన్ని విద్యార్థుల మార్గదర్శనానికి వినియోగించాలని ఆకాంక్షించారు. రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, జీపీఎఫ్‌తో పాటు ఇతర పదవీ విరమణ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలు, డీఏ బకాయిలను కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు.టీఎస్ యూటీఎఫ్ నాయకులు మనుపాటి సమ్మయ్య, సురేష్, విజయభాస్కర్ రెడ్డి, కిరణ్మయి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొని రామచంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు.

# కాంగ్రెస్ మోసాలకే వేణు ఆత్మహత్యాయత్నం..!

- ఉద్యోగాల పేరుతో రేవంత్ సర్కారు యువతను మోసం చేసింది
- గ్రూప్స్ అభ్యర్థి వేణు ఘటన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
- ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్
- బాధితుడిని పరామర్శించిన పువ్వాడ అజయ్, నామా నాగేశ్వరరావు
- నిరుద్యోగులు అధైర్యపడొద్దని బీఆర్ఎస్ పిలుపు
- వేణు కుటుంబానికి ఇల్లు.. ఉచిత వైద్యం కల్పించాలని డిమాండ్



, ఖమ్మం బ్యూరో : "ఉద్యోగాల పేరుతో యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... ఇప్పుడు అదే యువతను ఆత్మహత్యల దిశగా నెట్టేస్తోంది. గ్రూప్స్ అభ్యర్థి గడ్డం వేణు ఆత్మహత్యాయత్నం ప్రభుత్వ మోసపూరిత పాలనకు నిలువెత్తు నిదర్శనం. వేణు రాసిన సూసైడ్ నోట్ ఒక్క యువకుడి ఆవేదన కాదు... రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగుల గుండెచప్పుడు" అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముదిగొండ మండలం కొత్త లక్ష్మీపురానికి చెందిన గ్రూప్స్ అభ్యర్థి గడ్డం వేణు ఆత్మహత్యాయత్నం చేసి ఖమ్మంలోని ప్రశాంతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. శనివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజుతో కలిసి బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాతా మధుసూదన్ మాట్లాడుతూ... గత ఐదేళ్లుగా గ్రూప్స్ పరీక్షల కోసం అహర్నిశలు శ్రమించిన వేణు, ప్రభుత్వం మరో నోటిఫికేషన్ వస్తుందనే ఆశతో ఎదురు చూశాడన్నారు. కానీ ఒకే ఒక్క గ్రూప్ నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకోవడంతో తీవ్ర నిరాశకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అన్నారు. "చనిపోయే ముందు కూడా తన బాధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాహుల్ గాంధీలకు చేరాలని లేఖ రాయాల్సిన పరిస్థితి రావడం కాంగ్రెస్ పాలనకు సిగ్గుచేటు" అని విమర్శించారు. వేణు తల్లి మానసిక వికలాంగురాలని, తండ్రి కల్లు గీత కార్మికుడని, ఇంతటి నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు ఉన్నత చదువులు పూర్తి చేసి ఉద్యోగం కోసం పోరాడినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. "కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసిన యువకుడే... 'మమ్మల్ని మోసం చేశారు' అని ఆవేదన వ్యక్తం చేయడం ప్రభుత్వ వైఫల్యాన్ని బట్టబయలు చేస్తోంది" అని వ్యాఖ్యానించారు. వేణు కుటుంబానికి సొంత ఇల్లు కూడా లేదని, కిరాయి ఇంట్లో దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మెరుగైన ఉచిత వైద్యం అందించడంతో పాటు పక్కా ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. "రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరూ అధైర్యపడొద్దు... ప్రాణాలు తీసుకునే నిర్ణయాలు తీసుకోవద్దు... మీ పోరాటంలో బీఆర్ఎస్ అండగా ఉంటుంది" అని పిలుపునిచ్చారు.

### ఇది ఒక్క వేణు బాధ కాదు : పువ్వాడ అజయ్

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ... "వేణు ఘటనను వ్యక్తిగత విషాదంగా చూడలేం. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది నిరుద్యోగుల నిరాశకు ఇది ప్రతిబింబం. ఎన్నికల ముందు ఉద్యోగాల పేరుతో గొప్పలు చెప్పిన కాంగ్రెస్... అధికారంలోకి వచ్చిన తర్వాత యువతను పూర్తిగా విస్మరించింది. నోటిఫికేషన్లు ఎక్కడ? నియామకాలు ఎక్కడ?" అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని, వేణు కుటుంబానికి ఆర్థిక సహాయం, ఉచిత వైద్యం, పక్కా ఇల్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

### నిరుద్యోగుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి : నామా

మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ... "ఉద్యోగాల కోసం కష్టపడుతున్న యువత ఆశలు ఆవిరైపోతున్నాయి. వేణు ఘటన ప్రభుత్వాన్ని ఆలోచింపజేయాలి. ఇకనైనా నిరుద్యోగుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవాలి" అని కోరారు. ఆస్పత్రిలో పోలీసుల వ్యవహారశైలిపైనా బీఆర్ఎస్ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పరామర్శకు వచ్చిన నాయకులను, కుటుంబ సభ్యులను అడ్డుకునే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఉప్పల వెంకటరమణ, పగడాల నాగరాజు, వాచేపల్లి లక్ష్మారెడ్డి, అజ్మీరా వీరునాయక్, బత్తుల మురళి, షేక్ మక్బూల్, అయ్యప్పరెడ్డి జ్యోతిరెడ్డి, సామినేని హరిప్రసాద్, బిరెడ్డి నాగచంద్రారెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..
# మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



కాకతీయ, కారేపల్లి: కారేపల్లి మండలం ఎర్రబోడు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్జా సునీల్ (36) మృతి చెందారు. పాయం సాయితో కలిసి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా మూల మలుపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో సునీల్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, పాయం సాయికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతుడు ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా విద్యుత్ శాఖ సిబ్బందికి సహాయకుడిగా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య, 1 కుమార్తె, 1 కుమారుడు ఉన్నారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తనిఖీలు జరిగాయి..
# అనుమానాలు పోలేదు

- కారేపల్లిలో మద్యం సిండికేట్‌పై మళ్లీ ప్రశ్నలు
- ఆటోలో మద్యం విక్రయాలకు అనుమతి ఎవరిది..?
- జిల్లా కలెక్టర్ జోక్యంతో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్




కాకతీయ, కారేపల్లి : కారేపల్లి మండలంలో మద్యం సిండికేట్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. వరుసగా వెలువడిన కథనాల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం కొన్ని వైన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించినప్పటికీ, వాటితో పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తనిఖీలు కేవలం నామమాత్రంగానే జరిగాయా అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఆటోలో మద్యం విక్రయాలు జరిగినట్లు ప్రచారం జరగడంతో ఈ వ్యవహారం మరింత చర్చకు దారితీసింది. వైన్ షాపుల నుంచి ఆటోల్లో మద్యం విక్రయించేందుకు ఎక్సైజ్ శాఖ అనుమతి ఇచ్చిందా, లేక నిబంధనలకు విరుద్ధంగా ఈ విక్రయాలు జరుగుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తనిఖీల అనంతరం కూడా ఇలాంటి ఆరోపణలు రావడం అధికారుల పనితీరుపై సందేహాలకు తావిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. మద్యం సిండికేట్‌పై వస్తున్న ఆరోపణలు, అధిక ధరల వసూళ్లు, అక్రమ విక్రయాలపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కారేపల్లి మండలంలో మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకురావడంతో పాటు, అక్రమ రవాణా, సిండికేట్ వ్యవహారాలపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు. ఎక్సైజ్ శాఖ తనిఖీలపై కూడా పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## యువత సేవా దృక్పథంతో
# ముందుకు సాగాలి

- నవచైతన్య యువజన సంఘం సభ్యుల పిలుపు
- స్నేహితుల దినోత్సవం సందర్భంగా సమ్మేళనం
- డ్రగ్స్, మద్యం వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచన



కాకతీయ, గుండాల : స్వచ్ఛమైన మనసు, స్నేహభావం, సేవా దృక్పథంతో యువత సమాజ అభివృద్ధికి ముందుండాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన సమ్మేళనంలో వారు మాట్లాడారు. యువత చేపట్టే సేవా, చైతన్య కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. నవచైతన్య యువజన సంఘం మండలంలో అనేక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేస్తోందని కొనియాడారు. భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని, యువత ఐక్యంగా ఉండి సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం యువతలో పెరుగుతున్న డ్రగ్స్, మద్యం వంటి వ్యసనాలు ఆందోళన కలిగిస్తున్నాయని, అలాంటి అలవాట్లకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఈటీ నాగరాజు, వై. తిరుపతి, కే. పాపాచారి, ఎండీ యాకూబ్, జి. నారాయణ, బి. సారంగపాణి, హెడ్ కానిస్టేబుల్ మంగయ్యతో పాటు నవచైతన్య యువజన సంఘం సభ్యులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## మార్బుల్ వర్కర్స్ యూనియన్‌కు కొత్త కమిటీ

- అధ్యక్షుడిగా ఎస్.కె. జానీమియా ఎన్నిక
- ప్రధాన కార్యదర్శిగా ఎస్.కె. గోరేమియా, కోశాధికారిగా బాడిస వెంకటేశ్వర్లు



కాకతీయ, ఖమ్మం టౌన్ : ఖమ్మం నగర మార్బుల్ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు ఆదివారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం వరకు ప్రశాంతంగా కొనసాగగా, అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపులో ఎస్.కె. జానీమియా అధ్యక్షుడిగా, ఎస్.కె. గోరేమియా ప్రధాన కార్యదర్శిగా, బాడిస వెంకటేశ్వర్లు కోశాధికారిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో జిల్లా అధ్యక్షుడు దోనోజు లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి భుజం శ్రీనివాసరావుతో పాటు ఎర్ర మల్లికార్జున్, అమరబోయిన లింగయ్య, పోతం విశ్వనాథం, పోతం సీతారాములు, బెల్లంకొండ లింగయ్య, గోద రాంబ్రహ్మ గౌడ్, సారంగి రమణ, పల్లి మోతిరయ్య, రెంటపల్లి మోతిరయ్య, ఎస్.కె. మౌలానా, నల్లగట్ల నరసయ్య, ఎస్.కె. మీరా, బొందల రామారావు, వాజీద్ మహబూబ్ పాషా, బూర నరేష్, మెగిలి నరేష్, బండి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిజం అజరామరం



- కమ్యూనిస్టు భావజాలాన్ని భావితరాలకు అందించాలి
- ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టుల పాత్ర కీలకం
- సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు
- ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల సీపీఐ శిక్షణా తరగతులు

కాకతీయ, ఖమ్మం టౌన్ : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ శతాబ్ద కాలంగా కమ్యూనిస్టు ఉద్యమం అజరామరంగా కొనసాగుతోందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెంలో ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల సీపీఐ శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమం అధికారానికే పరిమితం కాదని, ప్రజా హక్కుల సాధనకే అంకితమై పని చేస్తోందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంతో పాటు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణలో కమ్యూనిస్టుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సమాజంలో పెరుగుతున్న అసమానతలు, కార్పొరేట్ ఆధిపత్యం నేపథ్యంలో కమ్యూనిస్టు భావజాలం అవసరం మరింత పెరుగుతోందని అన్నారు. ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. శిక్షణా తరగతుల్లో భాగం హేమంతరావు బోధకుడిగా వ్యవహరించగా, సిద్ధినేని కర్ణకుమార్ ప్రిన్సిపాల్‌గా, ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్ వైస్ ప్రిన్సిపాళ్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో మెదకంటి చిన్న వెంకటరెడ్డి, అజ్మీరా రామ్మూర్తి, పుచ్చకాయల కమలాకర్, సింగ్ నరసింహారావు, ఏనుగు వెంకటేశ్వరరావు, దంతాల బాలరాజు, లింగా వెంకటనారాయణ, పగిళ్ల వీరభద్రం, యడ్లపల్లి శంకరయ్య, మొహమ్మద్ గౌస్ పాషా, పుచ్చకాయల సుధాకర్, దండి రంగారావు, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల పరిస్థితి దయనీయం



- ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- ఆటో డ్రైవర్ల సంక్షేమానికి శాశ్వత చర్యలు చేపట్టాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- రఘునాథపాలెంలో బీఆర్ఎస్ బీఆర్‌టీయూ సమావేశం

కాకతీయ, ఖమ్మం బ్యూరో : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ బీఆర్‌టీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు, వార్షిక ఆర్థిక సాయం వంటి హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు, వాహన నిర్వహణ ఖర్చులు, ఫైనాన్స్ భారంతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయని, బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రమాద బీమా సహా పలు పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆటో డ్రైవర్లను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు.

## మాజీ ఎంపీ నామ విస్తృత పర్యటన

### పరామర్శలు, శుభకార్యాల్లో పాల్గొన్న మాజీ ఎంపీ



కాకతీయ, ఖమ్మం బ్యూరో : బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం, వైరా, మధిర నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. పరామర్శలు, కుటుంబ కార్యక్రమాలు, పార్టీ నేతలతో సమావేశాల్లో పాల్గొన్నారు. ఖమ్మం నగరంలో ఇటీవల కన్నుమూసిన రిటైర్డ్ ఇంజనీర్ బుగ్గవీటి కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు. అనంతరం అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కోమట్లగూడెం మాజీ సర్పంచ్ వేముల నర్సయ్యను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే అనారోగ్యం నుంచి కోలుకుంటున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వనమా విశ్వేశ్వరరావును ఆయన నివాసంలో పరామర్శించారు. వైరా మున్సిపాలిటీ ఐదో వార్డు నాయకుడు కొణతాలపల్లి సుబ్బారావును పరామర్శించిన నామ, మధిరలో జరిగిన పంచకట్టు వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.మాజీ వార్డు కౌన్సిలర్ ధీరావత్ మాధవి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఆషాడం మైసమ్మ బోనాలు


### బోనమెత్తిన సీపీఐ కౌన్సిలర్ దండి శ్రీజ–లోకేష్
### భక్తి పారవశ్యంలో మునిగిన శ్రీ సాయి బృందావన్ కాలనీ



కాకతీయ, ఖమ్మం టౌన్ : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సాయి బృందావన్ కాలనీలో ఆదివారం ఆషాడం మైసమ్మ బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని, శివసత్తుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల నడుమ నిర్వహించిన భారీ ఊరేగింపుతో కాలనీ భక్తిమయ వాతావరణంలో మునిగిపోయింది. అనంతరం మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీపీఐ కౌన్సిలర్ దండి శ్రీజ–లోకేష్ బోనం ఎత్తుకుని మహిళలతో కలిసి ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గుణగంటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సురభి సాయికృష్ణ, గౌరవ అధ్యక్షుడు ఏ. శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ చారి, జంపాల కిరణ్, సీపీఐ నాయకులు, మహిళలు, యువకులు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చందుర్తిపై దోమల దండయాత్ర

- జ్వరాల జోన్‌లో చందుర్తి మండలకేంద్రం
- డ్రై డే-ఫ్రైడేలు కాగితాలకే పరిమితమా?
- ఫీవర్ సర్వేల జాడ ఎక్కడా కనిపించడం లేదంటున్న గ్రామస్థులు
- ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు లేక ప్రజల్లో ఆందోళన
- జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్



కాకతీయ, చందుర్తి : రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో దోమల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. వర్షాలు కురుస్తుండటంతో గ్రామాల్లో దోమలు విపరీతంగా విజృంభిస్తుండగా, డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల భయం ప్రజలను వెంటాడుతోంది. అయితే ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అధికార యంత్రాంగం మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న డ్రై డే–ఫ్రైడే కార్యక్రమం మండలంలో వాస్తవంగా జరుగుతోందా..? లేక ఫొటోలు, నివేదికలకే పరిమితమైందా..? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని తొలగించడం, దోమల వ్యాప్తిని అరికట్టడం, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం తప్పనిసరి అయినప్పటికీ, పలు గ్రామాల్లో అలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడం, చెత్త పేరుకుపోవడం, నిల్వ నీరు తొలగించకపోవడం వల్ల దోమలు మరింత విజృంభిస్తున్నాయని చెబుతున్నారు.

### ఫీవర్ సర్వేలు జరిగాయా..?

జ్వరాల నియంత్రణ కోసం వైద్య శాఖ ఇంటింటా ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, మండలంలోని ఏ గ్రామాల్లో సర్వేలు జరిగాయి..? ఎన్ని ఇళ్లను సందర్శించారు..? ఎన్ని జ్వర కేసులను గుర్తించారు..? వారికి ఎలాంటి వైద్య సేవలు అందించారు..? అనే అంశాలపై స్పష్టత లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాగితాలపై నివేదికలు పంపితే సరిపోదని, గ్రామాల్లో అధికారులు ప్రత్యక్షంగా కనిపించాలని కోరుతున్నారు. దోమల నివారణలో కీలకమైన ఫాగింగ్, యాంటీ లార్వా మందుల పిచికారీ కూడా నామమాత్రంగానే జరుగుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో వారాల తరబడి ఫాగింగ్ యంత్రం కనిపించలేదని, ప్రజలు సొంతంగా దోమల నివారణ చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. జ్వరాల కేసులు పెరిగితే అప్పుడే స్పందించే పరిస్థితి కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?

సీజనల్ వ్యాధుల ముప్పు పెరుగుతున్నా సంబంధిత శాఖల సమన్వయం కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. డ్రై డే–ఫ్రైడే కార్యక్రమం, ఫీవర్ సర్వేలు, పారిశుద్ధ్య పనులు, ఫాగింగ్ వంటి చర్యలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని కోరుతున్నారు. పరిస్థితి మరింత విషమించకముందే జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించిప్రతి గ్రామంలోసమగ్ర దోమలనివారణ కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

## బోనమెత్తిన ఎమ్మెల్యే గంగుల

- కరీంనగర్‌లో వైభవంగా తెలంగాణ పండుగ
- శ్రీపురం, చింతకుంట, కిసాన్‌నగర్, కట్టరాంపూర్‌లో వేడుకలు



కాకతీయ, కరీంనగర్ : పోచమ్మ తల్లి, మైసమ్మ తల్లి బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఆదివారం కరీంనగర్ నగరంలోని శ్రీపురం కాలనీ, చింతకుంట, కిసాన్‌నగర్, కట్టరాంపూర్ ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు హాజరైన ఆయన స్వయంగా బోనం ఎత్తుకుని ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గంగుల కమలాకర్, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు కళకళలాడాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, 40వ డివిజన్ కార్పొరేటర్ నలువాల పుష్పలత రవీందర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేంద్రం నుంచి మరిన్ని నిధులు తెస్తాం

- కరీంనగర్ అభివృద్ధే నా ధ్యేయం
- నగరాభివృద్ధికి నిరంతర కృషి చేస్తాం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- రూ.50 లక్షల యూఐడీఎఫ్ పనులకు శంకుస్థాపన



కాకతీయ, కరీంనగర్ : కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు తీసుకురావడానికి కృషి చేస్తానని తెలిపారు. ఆదివారం కరీంనగర్ 24వ డివిజన్‌లోని బ్యాంక్ కాలనీలో రూ.50 లక్షల యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. అనంతరం కిసాన్‌నగర్‌లోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్, మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే మహోత్సవమని అన్నారు. ఇది కేవలం జాతర మాత్రమే కాదని, భక్తి, శక్తి, సంప్రదాయాల సమ్మేళనమని పేర్కొన్నారు. ఆషాఢ మాసంలో నిర్వహించే ఈ వేడుకలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని చెప్పారు. బోనాలు మహిళా శక్తికి ప్రతీకగా నిలుస్తాయని, తెలంగాణ జానపద కళలు, గ్రామీణ సంప్రదాయాలను భావితరాలకు అందించే సాంస్కృతిక వారసత్వమని పేర్కొన్నారు. కార్పొరేటీకరణ పెరుగుతున్న ఈ కాలంలోనూ తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే పండుగగా బోనాలు కొనసాగుతున్నాయని అన్నారు. బోనం అనేది కేవలం అమ్మవారికి సమర్పించే నైవేద్యం మాత్రమే కాదని, భక్తుల విశ్వాసానికి ప్రతీక అని చెప్పారు. పోతురాజు నృత్యం సమాజ రక్షణకు, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు.

## ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి ఉద్యమాలు

**సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటాలకు పిలుపు**




కాకతీయ, కరీంనగర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గ్రామస్థాయి నుంచి ప్రజలను సమీకరించి ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఉప్పునూటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలతో ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. కార్మికులు, రైతులు, కూలీలు, యువత, మహిళల సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థాయి నుంచి ఐక్య ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందని, రైతులకు ఉచిత విద్యుత్‌పై భవిష్యత్తులో ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అలాగే విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వ పెట్టుబడులు పెంచి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలను బలోపేతం చేయాలని కోరారు. విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్ రంగాల సమస్యలపై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గిట్ల ముకుందరెడ్డి, సుంకర సంపత్, జి. రాజేశం, కోనేటి నాగమణి, నారాయణ, రామ్మోహన్‌రావు, అరవింద్, మాతంగి శంకర్, దండిగారి సతీష్, కొమ్మరాజుల వెంకటేష్, గోరేమియా, రాజ్‌కుమార్, ఇమ్మడి శ్రీకాంత్, రాకేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధికి మున్నూరుకాపులు వారధులు కావాలి

- సేవా కార్యక్రమాలతో సమాజానికి అండగా నిలవాలి
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపు
- గ్రేటర్ విద్యానగర్ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకారం



కాకతీయ, కరీంనగర్ : మున్నూరుకాపు సంఘాలు కేవలం సామాజిక వేదికలుగా కాకుండా సమాజ అభివృద్ధికి దోహదపడే సంస్థలుగా ఎదగాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. సభ్యులంతా ఐకమత్యంతో సేవా కార్యక్రమాలు చేపట్టి యువత, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం గ్రేటర్ విద్యానగర్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మల్లాపూర్ రోడ్డులోని లత గార్డెన్‌లో నిర్వహించిన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవం, సన్మాన కార్యక్రమం, వనభోజన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ కూడా హాజరై నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ కుల సంఘాలు సామాజిక చైతన్యం, విద్యా ప్రోత్సాహం, సేవా కార్యక్రమాలకు కేంద్రాలుగా నిలవాలని సూచించారు. సంఘం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘాలు సామాజిక ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు యువతను విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు నడిపించాలని సూచించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పరస్పర సహకారం, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, తెలంగాణ మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తంరావు, జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ తదితరులు సంఘటిత శక్తితోనే సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రజాప్రతినిధులు, కుల పెద్దల సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. వారికి ఘనంగా సన్మానం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన భోజన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సభ్యులు, మహిళలు, యువత, చిన్నారులు కుటుంబ సమేతంగా పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో చల్లా హరిశంకర్, పురమల్ల శ్రీనివాస్, బోనాల నర్సయ్య పటేల్, ఉప్పు తిరుపతి పటేల్, బట్టు సుధాకర్ పటేల్, ఐల రాంమోహన్, ఉప్పు శ్రీనివాస్ పటేల్, సత్తినేని శ్రీనివాస్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## మానాలకు కొత్త జలధార

- రూ.8 లక్షలతో నూతన తాగునీటి పైప్‌లైన్ పనులకు శ్రీకారం
- కోమటి చెరువు బావి నుంచి వాటర్ ట్యాంక్ వరకు పైప్‌లైన్
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- సర్పంచ్ బుర్ర శంకర్, ఉప సర్పంచ్ దాసరి

కాకతీయ, రుద్రంగి : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జిల్లా పరిషత్ నిధులతో రూ.8 లక్షల వ్యయంతో నూతన తాగునీటి పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. కోమటి చెరువు సమీపంలోని మంచినీటి బావి నుంచి గ్రామ వాటర్ ట్యాంక్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు పనులకు గ్రామ సర్పంచ్ బుర్ర శంకర్, ఉప సర్పంచ్ దాసరి అశోక్ శ్రీకారం చుట్టారు. గ్రామంలో తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పైప్‌లైన్ పూర్తయిన తర్వాత ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందడంతో పాటు వేసవిలోనూ నిరంతరాయంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు లక్కాకుల రమేష్, నాయకులు తుమ్ జలపతి, బాధనవేణి రాజారాం, జక్కు వంశీ, జక్కు లింగారెడ్డి, కొండ రాజేందర్, చెదలు నవీన్, కరోబర్ తిరుపతి, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక

- కాంగ్రెస్ మంత్రుల వ్యాఖ్యలు అజ్ఞానానికి నిదర్శనం
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- 'కాళేశ్వరం బాట'లో భాగంగా ఎల్లంపల్లి, పంప్‌హౌజ్‌ల పరిశీలన
- గ్రావిటీపై అవగాహన లేక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శ
- కాళేశ్వరం మోటార్లు నడిపి జలాశయాలు నింపాలని డిమాండ్



కాకతీయ, కరీంనగర్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ మంత్రులు చేస్తున్న విమర్శలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ప్రాజెక్టును రాజకీయ కోణంలో కించపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్ర సాగు, తాగునీటి అవసరాలకు జీవనాధారంగా నిలిచిందని, దీనిని 'కూళేశ్వరం'గా అభివర్ణించడం కాంగ్రెస్ నేతల అవగాహనలేమికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ మంత్రుల వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన 'కాళేశ్వరం బాట' కార్యక్రమంలో భాగంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో పాటు మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు కోటిలింగాల వద్ద ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్, మేడారం నంది పంప్‌హౌజ్, రామడుగు గాయత్రి పంప్‌హౌజ్‌లను పరిశీలించారు.

### మంత్రులకు గ్రావిటీపై అవగాహన లేదు

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గ్రావిటీ వ్యవస్థపై కనీస అవగాహన లేకుండానే మంత్రులు ప్రాజెక్టుపై వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ నుంచి గాయత్రి పంప్‌హౌజ్ వరకు గ్రావిటీ లేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లి వరకు, అక్కడి నుంచి మేడారం నంది పంప్‌హౌజ్, రామడుగు గాయత్రి పంప్‌హౌజ్ వరకు నీటిని దశలవారీగా ఎత్తిపోసి, అనంతరం గ్రావిటీ ద్వారా మిడ్‌మానేరు జలాశయానికి తరలించే విధానాన్ని కాంగ్రెస్ నేతలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తున్నారని వివరించారు.

### జలాశయాలు నింపాలని డిమాండ్

రాష్ట్రంలో ఏర్పడుతున్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. కాళేశ్వరం మోటార్లను పూర్తిస్థాయిలో నడిపి ఉత్తర తెలంగాణలోని జలాశయాలను నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ విమర్శలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని వారు విమర్శించారు.

## కరీంనగర్ బిల్డ్ ఎక్స్‌పోలో భద్రతా ఏర్పాట్లు

- భారీ కూలర్లు, అదనపు ఏసీల ఏర్పాటు
- ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లతో భద్రతా చర్యలు
- సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన

కాకతీయ ఎఫెక్ట్








ఫైర్ సేఫ్టీకి అనుమతులున్నాయా..?

ఆదివారం కాకతీయలో ప్రచురితమైన కథనం

కాకతీయ, కరీంనగర్ : కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న బిల్డ్ ఎక్స్‌పో–2026లో కనీస సౌకర్యాల కొరతపై కాకతీయలో ప్రచురితమైన కథనానికి నిర్వాహకులు వెంటనే స్పందించారు. ఎక్స్‌పో ప్రాంగణంలో ఉక్కపోత, వెంటిలేషన్ సమస్యలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్ల లోపాలను ప్రస్తావిస్తూ వచ్చిన కథనం అనంతరం ఆదివారం ఉదయం నుంచే పలు చర్యలు చేపట్టారు. స్టాళ్ల ప్రాంతంలో గాలి ప్రసరణ మెరుగుపడేలా భారీ కూలర్లు, అదనపు ఏసీలను ఏర్పాటు చేశారు. అలాగే సందర్శకులు, స్టాల్ నిర్వాహకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను అందుబాటులో ఉంచారు. దీంతో ఎక్స్‌పోను సందర్శిస్తున్న ప్రజలు, స్టాల్ నిర్వాహకులు ఊరట వ్యక్తం చేస్తున్నారు. కథనాన్ని సానుకూలంగా స్వీకరించి తక్షణ చర్యలు తీసుకున్న నిర్వాహకులను పలువురు అభినందిస్తున్నారు. అయితే వేలాది మంది సందర్శకులు హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో తాగునీరు, విశ్రాంతి ఏర్పాట్లు, వెంటిలేషన్, అత్యవసర భద్రతా చర్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సందర్శకులు కోరుతున్నారు. ఎక్స్‌పో ముగిసే వరకు అన్ని సౌకర్యాలు సమర్థవంతంగా కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

## బైక్ అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు



కాకతీయ, చందుర్తి: రాజన్న సిరిసిల్ల జిల్లా బండపల్లి–ఎన్గల్ గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పులి ప్రణయ్ తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 ఈఎంటీ ప్రశాంత్, పైలట్ తోట నరేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి బాధితుడిని మెరుగైన వైద్యం కోసం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.